వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 337 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూన్ 2025 | వెల : రూ 10/-



## వేగంగా రైతు భరోసా నిధుల బదిలీ

- రైతు ఖాతాల్లో నేరుగా నగదు జమ
- 62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వానాకాలం పంటల పెట్టుబడి సాయంగా అందిస్తున్న రైతు భరోసాను రికార్డు వేగంతో పంపిణీ చేస్తోంది. కేవలం తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన మేరకు ఆర్థిక శాఖ ఏ రోజుకారోజు నిధులను విడుదల చేస్తుంది. వ్యవసాయ శాఖ అందించిన జాబితాల ప్రకారం రైతుల -మిగతా 2 లో



## ఇంగ్లీష్ మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి

విదేశీ బాషలను దూరం పెట్టే రోజులు వస్తాయి
పుస్తకావిష్కరణ కార్యక్రమంలో అమిత్ షా వ్యాఖ్య

న్యూఢిల్లీ,
మన దేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మాతృభాషలోనే దీనిని అర్థం చేసుకోగలమని అన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమన్నారు. విదేశీ భాషలకు సంబంధించి కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో -మిగతా 2 లో



## 'బ్యాగుల' మీద ఉన్న నాలెడ్జ్.. 'బేసిన్ల' మీద లేదు..

- బేసిన్ల మీద అవగాహన లేకుంటే ఎలా
- దేవాదుల ఏ బేసిన్ కింద ఉందో కూడా తెలీదా
- బనకచర్లపై పక్కదోవ పట్టించేలా మాట్లాడుతారా
- సీఎం తీరుపై మండిపడ్డ హరీష్ రావు

హైదరాబాద్ .
ఆంధ్రా జల దోపిడీని అడ్డుకుని.. తెలంగాణ పొలాలకు నీళ్లు పారియ్యమని, అక్రమ ప్రాజెక్టును ఆపమని అడిగితే.. అది చేతగాక అడ్డుఅదుపు లేకుండా అబద్ధాల ప్రవాహాన్ని నిన్న సీఎం పారించే ప్రయత్నం చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అసలు విషయం మాట్లాడకుండా.. విషయాన్ని పక్కదోవ పట్టించారు. మా ఎంపీ రవిచంద్ర బాగా ఆర్గ్యూ చేశారు. బనచకర్ల ప్రాజెక్టును -మిగతా 2 లో




## మెట్రో రెండోదశ కు అనుమతించండి

- 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్-2 డీపీఆర్ అందించాం
- కేంద్రమంత్రి ఖట్టర్‌తో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి వినతి
- బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తోను చర్చలు

హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యకు ఇదే పరిష్కారం



న్యూఢిల్లీ
మెట్రో రెండోదశకు వెంటనే అనుమతులు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఢిల్లీలో కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో ఆయన నివాసంలో తెలంగాణ -మిగతా 2 లో




## భారత్-పాక్ యుద్ధాన్ని ఆపింది నేను కాదు..


- ఆ రెండు దేశాలే ఉద్రిక్తతలను పరిష్కరించుకున్నాయి
- మోడీ వ్యాఖ్యలతో ట్రంప్ యూ టర్న్

వాషింగ్టన్,౼.
భారత్ -పాక్ మధ్య ఉద్రిక్తతలను తానే ఆపానని, రెండు దేశాల మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం తన ఘనతే అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చెప్పుకుంటున్న విషయం తెలిసిందే. ట్రంప్ ప్రకటనపై భారత్‌లో పెద్ద ఎత్తున దుమారం రేగింది. దీంతో రంగంలోకి దిగిన ప్రధాని మోదీ.. స్వయంగా ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మధ్యవర్తిత్వాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించదని స్పష్టం చేశారు. ఇందులో అమెరికా ప్రమేయం లేదని ట్రంప్‌కు తేల్చి చెప్పారు.ఈ క్రమంలో ట్రంప్ ఈ వ్యవహారంపై తాజాగా స్పందించారు. ఎట్టకేలకు వాస్తవాన్ని అంగీకరించారు. భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల పరిష్కారంలో తన ప్రమేయం లేదని స్పష్టం చేశారు. -మిగతా 2 లో

## కేబినేట్ నిర్ణయించకుండా పనులు చేపడతారా

సీఎం రేవంత్ రెడ్డికి ఈ విషయం తెలియదా

- కాళేశ్వరం కూడా కేబినేట్ నిర్ణయం మేరకే జరిగింది
- ప్రాజెక్టులు కట్టడం వేరు..అవినీతి చోటు చేసుకోవడం వేరు
- అందుకే కాళేశ్వరం అవినీతిపై సిబిఐ విచారణను కోరుతున్నాం
- సీఎం రేవంత్ వ్యాఖ్యలపై ఎంపి ఈటెల రాజేందర్ వ్యాఖ్య



హైదరాబాద్
సుందిళ్ళ, అన్నారం, మేడిగడ్డ ప్రాజెక్టులు రీ డిజైన్ లో కేసీఆర్ చేర్చారు.. అవినీతి జరిగితే విచారణ జరపండి, విచారణ జరిగినా చర్యలు తీసుకుంటారాని నమ్మకం లేదు, అందుకే సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేస్తునామని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ అన్నారు. ప్రాజెక్టులు రాజకీయ పార్టీలకు ఏటిఎంలుగా మారాయని ఎంపీ ఈటల తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ స్పందించారు. ఈ సందర్భంగా కేబినెట్‌లో ఆమోదం లేకుండా ఏమి జరగదు.. ఆయన మంత్రి వర్గంలో ఉన్నవారే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు, ఈ విషయం వారిని అడగవచ్చని సూచించారు. -మిగతా 2 లో



## సెల్‌ఫోన్ ఇవ్వాల్సిందేనంటున్న ఏసీబీ

- కుదరదంటున్న మాజీమంత్రి కేటీఆర్
- సెల్‌ఫోన్ వ్యవహారంపై పట్టుదలగా ఏసీబీ

హైదరాబాద్,
ఫార్ములా ఈ కార్ రేస్ కేసు ఇప్పుడు సెల్ ఫోన్ చుట్టూనే తిరుగుతుంది.. కేటీఆర్ సెల్‌ఫోనే ఏసీబీ అధికారులకు కీలకంగా మారింది.. సెల్‌ఫోను ఇచ్చేది -మిగతా 2 లో

## న్యాయం జరగకుంటే సుప్రీంకు వెళ్తాం

- బనకచర్ల ప్రాజెక్టు అంశంలో అభ్యంతరాలను వివరించాం
- పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని ఫిర్యాదు
- కేంద్రమంత్రి పాటిల్‌ను కలిసిన సీఎం రేవంత్, ఉత్తమ్

న్యూఢిల్లీ
బనకచర్ల ప్రాజెక్టు అంశంలో తమకు ఉన్న అభ్యంతరాలను కేంద్రమంత్రికి వివరించామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బనకచర్ల ప్రాజెక్టు పట్ల తెలంగాణ ప్రజల్లో తెలంగాణ రైతుల పట్ల ఆందోళన ఉందని, గోదావరి కృష్ణ నుంచి 1500 టీఎంసీల వాటర్ తెలంగాణకు బ్లాంకెట్ ఎన్‌వోసి ఇస్తే దాని ద్వారా కోటిన్నర ఎకరాలకు నీళ్లు అందించగలుగుతామని అన్నారు. దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి -మిగతా 2 లో



## ప్రధాని మోడీ పర్యటన షెడ్యూల్ ఖరారు

- మూడు రాష్ట్రాల్లో రెండు రోజుల పర్యటన
- 21న విశాఖలో అంతర్జాతీయ యోగాకు హాజరు



న్యూఢిల్లీ,
భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల20, 21వ తేదీల్లో మూడు రాష్ట్రాల్లో ప్రర్యటించనున్నారు. బీహార్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రల్లో పర్యటించనున్నట్లు అధికారికంగా ప్రధాని కార్యాలయం ప్రకటించింది. బీహార్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోదీ ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నారు. ఒడిశాలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రధానమంత్రి హాజరవుతున్నారు. 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో -మిగతా 2 లో

# 'బ్యాగుల' మీద ఉన్న 'బేసిన్ల' మీద లేదు..

(మొదటి పేజీ తరువాయి)

ఆపేందుకు ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా సహకరిస్తుంది. దీన్ని గాంధీ భవన్‌గా, రాజకీయ వేదికగా మార్చకు. అసెంబ్లీ ఏర్పాటు చేసి ఏకగ్రీవ తీర్మానం

చేయ్. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లు అని మా ఎంపీ స్పష్టంగా చెప్తే సీఎం మాత్రం రాజకీయ వేదికగా మార్చారు అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సెటైర్లు వేశారు. బహుషా బ్యాగుల మీద ఉన్న నాలెడ్జ్.. బేసిన్ల మీద లేదని రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు విమర్శించారు. బేసిన్ల మీద బేసిక్ నాలెడ్జ్ లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు మీద నిన్న రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు రాష్ట్ర ప్రజలు చూశారు. గత కొంతకాలంగా బనకచర్లను అడ్డుకోండని మేం మాట్లాడితే.. బొడిగుండుకు, మోకాలికి ముడిపెట్టినట్టుగా నిన్న రేవంత్ రెడ్డి మాట్లాడారు. అసలు విషయాన్ని పక్కనపెట్టి సొల్లు వాగుడు వాగారు ముఖ్యమంత్రి. బేసిన్ల గురించి బేసిక్ నాలెడ్జ్ లేకుండా మాట్లాడారు. ఆయనకు బహుషా బ్యాగుల మీద మంచి నాలెడ్జ్ ఉన్నట్టుంది కానీ బేసిన్ల మీద నాలెడ్జ్ లేదని నిన్నటి పీపీటీతో స్పష్టమైపోయింది. పీపీటీ పెట్టి మరి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి తమ అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారు. దీంతో రాష్ట్రం పరువు పోయింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కనీసం బేసిక్ నాలెడ్జ్ లేకుండా ఉంటారా..? అని రాష్ట్ర ప్రజలు నవ్వుకునే పరిస్థితి ఏర్పడింది. సీఎం ఇంత అజ్ఞానంగా ఉంటాడా..? అని దేశం ముందు పరువు పోయే పరిస్థితి వచ్చింది. సీఎంకు, ఉత్తమ్‌కు కనీస జ్ఞానం లేకపోవడం ఈ రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యం. రేవంత్ రెడ్డి అంతులేనటువంటి అజ్ఞానంతో, మూర్తీభవించిన మూర్ఖత్వంతో నిన్న మాట్లాడారు. విషాదం ఏంటంటే.. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందని రేవంత్ రెడ్డి అడుగుతాడు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో తెలియదు.. బనకచర్ల ఏ బేసిన్‌లో కడుతున్నారో ఆయనకు తెలియదు. అసలు సీఎం రేవంత్ ఏం చేస్తున్నట్లు.? బనకచర్ల మీద ఏపీ ఆరు నెలల నుంచి పని చేస్తూ.. కేంద్ర ఆర్థిక మంత్రికి ఉత్తరాలు రాస్తూ.. కేంద్ర జలవనరుల శాఖ మంత్రిని కలుస్తూ ముందుకు పోతుంటే.. సీఎం అమాయకంగా బనకచర్ల ఏ బేసిన్‌లో ఉంది అని అడుగుతున్నాడు. దీని బట్టి తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రేవంత్ రెడ్డికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమైపోతోంది అని హరీశ్‌రావు అన్నారు. ÷శివంత్ రెడ్డి లాగా నేను విజ్ఞతను పోగొట్టుకునే వ్యక్తిని కాదు. రేవంత్ రెడ్డి కుసంస్కారి. సంస్కారం లేని వ్యక్తి. మాట్లాడితే సొల్లు.. ఎదుటి వారిమీద బురద జల్లడం, నోటికొచ్చినట్టు వదరుబోతు తనంతో మాట్లాడడం. మాకేమో కొన్ని ఎథిక్స్ ఉన్నాయి. క్యారెక్టర్‌తో ఉన్నాం. ఉద్యమాలు, పోరాటాల నుంచి వచ్చినోళ్లం.. నీలాగా అడ్డమైన తొక్కుళ్లు తొక్కుకుంటూ వచ్చినోళ్లం కాదు. ఈయనకు బేసిక్స్ తెలియవు.. బేసిన్స్ తెలియవు అని నేను ఉట్టిగా అనలేదు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందని సామాన్య రైతును అడిగినా, స్కూల్ పిల్లగాడిని అడిగినా.. గోదావరి మీద కట్టింద్రు అని చెప్తరు. సీఎం రేవంత్‌కు దాని మీద జ్ఞానం లేకపోవడం శోచనీయం. రేవంత్ రెడ్డి తెలుసుకోవాల్సింది ఏందంటే.. బూతులు తెలుసుకున్నంత సులువు కాదు.. బేసిన్ల గురించి తెలుసుకోవడం. బూతులు మాట్లాడినంత సులువు కాదు.. బేసిన్ల గురించి అర్థం చేసుకోవడం రేవంత్ రెడ్డి గారు. నీ చిల్లర రాజకీయాలతో నీ అజ్ఞానాన్ని బయట పెట్టుకుని రాష్ట్రం పరువు తీశావు అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు.

# మెట్రో రెండోదశకు అనుమతించండి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు సమావేశం అయ్యారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్-2 అవసరం ఎంతో ఉందని కేంద్ర మంత్రికి దృష్టికి తీసుకెళ్లారు సీఎం. రూ.24,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. మెట్రో ఫేజ్-2 సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా కొనసాగడంతో పాటు రహదారులపై రద్దీ కూడా తగ్గుతుందని వెల్లడించారు. అలాగే, సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని కేంద్ర మంత్రి ఖట్టర్ కు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇక, పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టు డీపీఆర్ సమర్పించిన విషయాన్ని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చినట్లు గుర్తు చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-ఎఎ ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపి జితేందర్ రెడ్డి, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ భేటీ అయ్యారు. గంటపాటు వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ 2వ వార్షికోత్సవం సందర్భంగా ఆవిష్కరించే 'తెలంగాణ రైజింగ్ 2027' కార్యక్రమం వివరాలను సీఎం టోనీ బ్లెయిర్‌కు అందించారు. రైతులు, యువత, మహిళలు ఇలా అన్ని వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి, మానవ అభివృద్ధి సూచికల మెరుగుదలకు ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. కోర్ అర్బన్, పెరి-అర్బన్, గ్రామీణ మండలలాతో మైక్రోప్లానింగ్‌కి సంబంధించిన విషయాలను టోనీతో పంచుకున్నారు. అనంతరం టోనీ బ్లెయిర్ మాట్లాడుతూ.. అభివృద్ధి అజెండా స్థిరత్వ సూత్రాల ద్వారానే సాధించవచ్చున్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి అంశాలపై టోనీలబెయిర్ ప్రత్యేక ఆసక్తి కనబరిచారని సీఎం కార్యాలయం పేర్కొంది. తెలంగాణ రైజింగ్ విజన్ డెవలప్‌మెంట్ అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం, టోనీ ÷-లబెయిర్ ఇన్‌స్టిట్యూట్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్లు ప్రకటించింది.

# కేబినేట్ నిర్ణయించకుండా పనులు చేపడతారా

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ మొదలు పెట్టిన ప్రాజెక్ట్ అని నేను చెప్పాను, అది ఎప్పుడు మొదలయ్యిందో తెలుసుకోవాలని పేర్కొన్నారు. అయితే, మొదట పిల్లర్లు రిపేర్ చేసి నీళు ఇచ్చే పని పెట్టుకోండని రాష్ట్ర ప్రభుత్వానికి ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. ప్రాజెక్టులు కట్టడం తప్పు కాదు, వాటి పేరుతో అక్రమాలు చేయడం తప్పు అన్నారు. కేబినెట్ ఆమోదం లేకుండా ఇంత పెద్ద ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతుందా అని ప్రశ్నించారు. ప్రతి నిర్ణయం కేబినెట్ రాటిఫికేషన్ జరుగుతుంది.. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని డాక్యుమెంట్స్ మీకు పంపిస్తాను అని చెప్పుకొచ్చారు. మీ డిపార్ట్‌మెంటో ఏ నిర్ణయం తీసుకోవాలి అనుకున్నా.. కేబినెట్ లో పెట్టండి అని కేసీఆర్ చెప్పే వారు ఇది నిజం కాదంటే నేను దేనికైనా సిద్ధం అని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మించడం, అవినీతి వేరువేరుగా చూడాలి.. ప్రాజెక్ట్ నిర్మించాలి కానీ వాటిని అడ్డం పెట్టుకొని సంపాదించడాన్ని మా పార్టీ వ్యతిరేకిస్తుందని బీజేపీ ఎంపీ ఈటల చెప్పారు. ఇక, తెలంగాణ ఉద్యమం నీళు, నిధులు, నియామకాల కోసం సాగిందని ఈటల రాజేందర్ తెలిపారు. నేను జైళ్లకు పోయిన, నా రక్తం చిందిది, పెట్రోల్ మంటల్లో యువత కాలిపోయింది, ఫలితంగా వచ్చిన తెలంగాణలో ప్రాజెక్ట్ కట్టాలా వద్దా? అని ప్రశ్నించారు. అనేక ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే మొదలు పెట్టారు కానీ పూర్తిచేయలేదు.. జలయజ్ఞంలో భాగంగా ప్రాణహిత- చేవెళ్ల ఐదేళ్లలో పూర్తి చేసే ప్రాజెక్టేనా కదా?.. ఎందుకు పూర్తి చేయలేదన్నారు. కమిషన్ త్వరగా పూర్తి చేయాలి అవినీతి నిగ్గు తేల్చాలి.. బీజేపీ అయితే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తుంది.. బీజేపీ ప్రాజెక్ట్స్ కట్టడానికి వ్యతిరేకం కాదు.. అధికారం అడ్డం పెట్టుకొని టెండర్లు లేకుండా పనులు పంచుకోవడం తప్పు అని ఎంపీ ఈటల పేర్కొన్నారు.

## న్యాయం జరగకుంటే సుప్రీంకు వెళ్తాం

(మొదటి పేజీ తరువాయి)

గురువారం కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశమయ్యారు. పోలవరం , బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని ఫిర్యాదు చేశారు. భేటీ ముగిసిన అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.. బనకచర్ల లింక్ ప్రాజెక్టు చట్ట విరుద్ధమని చెప్పామని.. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర జలశక్తి మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. బనకచర్లపై త్వరలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహిస్తామని కేంద్రమంత్రి చెప్పారని, గోదావరిలో 1000 టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు తెలంగాణకు బ్లాంకెట్ ఎన్వోసి ఏపీ రాసివ్వాలని కోరామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. దానికి కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలపాలన్నారు. అప్పుడే తాము బనకచర్లపై ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు తప్పనిసరి అని, ఇప్పటి వరకు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వలేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు త్వరితగతిన ఆమోదాలు లభిస్తున్నాయని, తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన అనేక ప్రాజెక్టులు వేగవంతంగా నిర్మాణం చేయాలనుకున్నా.. ప్రాజెక్టులు అనుమతులు నెమ్మదిగా అవుతున్నాయని మంత్రి అన్నారు. అయితే తమ అభ్యంతరాలపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ అన్ని విధాలుగా హామీ ఇచ్చారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా మూసి పునర్జీవం కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారన్నారు. తెలంగాణకు అన్యాయం జరగకుండా అన్ని విధాల చర్యలు చేపడతామని చెప్పారన్నారు. బనకచర్ల ప్రాజెక్టు అంశంలో వీలైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రధాని మోడీ పర్యటన షెడ్యూల్ ఖరారు



(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలుపంచుకోనున్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విశాఖ కేంద్రంగా ప్రధాని మోదీ నేతృత్వం వహించనున్నారు. 21వ తేదీన ఉదయం 6.30గంటలకు యోగా అనంతరం మోదీ ప్రసంగించనున్నారు. విశాఖ బీచ్ రోడ్డులో నిర్వహించే యోగా కార్యక్రమానికి సామాన్య ప్రజలతో కలిసి మోదీ పాల్గొంటారని ప్రధాని కార్యాలయం ప్రకటించింది. ఈ కార్యక్రమానికి సుమారు 5 లక్షల మంది హాజరవుతారని ప్రధాని కార్యాలయం తెలిపింది.

## వేగంగా రైతు భరోసా నిధుల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

ఖాతాల్లో నగదును జమ చేస్తోంది. అయితే, 16వ తేదీన రైతు నేస్తం వేదికగా స్వయంగా సీఎం రైతు భరోసా చెల్లింపులను ప్రారంభించారు. నాలుగు రోజుల్లోనే రికార్డు వేగంతో 6,405 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ప్రకటించింది. గురువారం సాయంత్రం నాటి వరకు రాష్ట్రంలో ఐదు ఎకరాల్లోపూ భూములున్న రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమయ్యాయి. ఇక, ఇప్పటి వరకు మొత్తం 62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో నిధులు జమైనట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది. మొత్తం ఒక కోటి ఆరు లక్షల (1.06 కోట్లు) ఎకరాల భూములకు పెట్టుబడి సాయం అందింది. ఒక ఎకరంలోపు 24.22 లక్షల మంది రైతులు, రెండెకరాల లోపు 17.02 లక్షల మంది, మూడు ఎకరాల లోపు 10.45 లక్షల మంది, 4 ఎకరాల లోపు 6.33 లక్షల మంది, 5 ఎకరాల లోపు 4.43 లక్షల మంది ఇప్పటి వరకు రైతు భరోసా పథకం ద్వారా లబి&ధ పొందారు. వానాకాలం పంటలకు సరైన అదునులో ఎకరానికి రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయం తమ ఖాతాల్లో జమ కావటంతో రాష్ట్రవ్యాప్తంగా రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం రైతు భరోసా నిధులను వేగంగా చెల్లింపులు చేస్తున్న తీరు కొత్త రికార్డు నెలకొల్పింది.

## ఇంగ్లీష్ మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి

(మొదటి పేజీ తరువాయి)

లేవన్నారు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలని పేర్కొన్న ఆయన.. అవి మనుగడలో లేకుంటే నిజమైన భారతీయులుగా ఉండలేమని వ్యాఖ్యానించారు. మాజీ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రాసిన ఓ పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా అమిత్ షా ఈ విధంగా మాట్లాడారు. ఈ దేశంలో ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి. అటువంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవు. మన దేశ భాషలే మన సంస్కృతికి మూలాలు. మన భాషలే లేకుంటే మనం నిజమైన భారతీయులుగా ఉండలేం. దేశ భాషా వారసత్వాన్ని పునరుద్ధరించే సమయం ఆసన్నమైంది. ఇందుకోసం ప్రయత్నం చేయాలని అమిత్ షా పిలుపునిచ్చారు. అయితే, ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. మన దేశంతోపాటు ప్రపంచాన్ని కూడా మన సొంత భాషలతోనే నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ అగ్నిహోత్రి మాట్లాడుతూ.. కేంద్ర సర్వీసు ఉద్యోగులకు ఇచ్చే శిక్షణలో మార్పు ఎంతో అవసరమని అన్నారు.

## భారత్-పాక్ యుద్ధాన్ని ఆపింది నేను కాదు..

(మొదటి పేజీ తరువాయి)

భారత్-పాక్ చర్చల ద్వారా ఉద్రిక్తతలను పరిష్కరించుకున్నాయని చెప్పారు. పాకిస్థాన్ సైన్యాధిపతి, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం ఆయనకు ట్రంప్ విందు ఇచ్చారు. అనంతరం ఓవల్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడారు. 'భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతల పరిష్కారంలో నా ప్రమేయం లేదు. ఇద్దరు తెలివైన నేతలు యుద్ధాన్ని ముగించాలని నిర్ణయించుకున్నారు. లేదంటే ఆ పరిస్థితులు అణుయుద్ధానికి దారి తీసేవి. ఆ రెండు దేశాలూ అణుశక్తి కలగినవి. అందుకే చర్చల ద్వారా ఉద్రిక్తతలను పరిష్కరించుకున్నాయి' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిన్న ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. భారత్-పాక్ మధ్య ఒప్పందం విషయంలో అమెరికా ప్రమేయం లేదని ట్రంప్‌తో ప్రధాని తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని కేంద్ర విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి వెల్లడించారు. దాదాపు 35 నిమిషాల పాటూ ఇద్దరూ ఫోన్‌లో సంభాషించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్' వివరాలను ట్రంప్‌కు మోదీ వివరించినట్లు తెలిపారు. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి మిలటరీ స్థాయి చర్చలు జరిగాయన్నారు. ఇతరుల మధ్యవర్తిత్వాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించబోదనే విషయాన్ని అమెరికా అధ్యక్షుడికి మోదీ స్పష్టంగా చెప్పినట్లు మిస్రీ వివరించారు

## సెల్‌ఫోన్ ఇవ్వాల్సిందేనంటున్న ఏసీబీ

(మొదటి పేజీ తరువాయి)

లేదని కేటీఆర్ ఏసీబీకి కరాకండిగా తేల్చి చెప్పారు.. గతంలో వాడిన సెల్ ఫోను ఇప్పుడు తన దగ్గర లేదని, ఇప్పుడు కొత్త ఫోన్ వాడుతున్నానని చెప్పారు.. ఇందుకు సంబంధించి లిఖిత పుర్వకంగా ఏసీబీ అధికారులకు కేటీఆర్ సమాధానం పంపాడు.. అయితే ఫోన్ ఇవ్వకపోతే తదుపరి చర్యలకు తాము సిద్ధమని ఏసీబీ అధికారులు అంటున్నారు.. ఎలాంటి చర్యలు తీసుకుంటారనీ ఏసీబీ మాత్రం చెప్పడం లేదు. మరోవైపు వ్యక్తిగత గోప్యత భంగం కలిగించే విధంగా ఫోన్ అడగడం చట్ట వ్యతిరేకమని కేటీఆర్ వాదిస్తున్నాడు.. సెల్ ఫోనుకు సంబంధించిన వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని, దాని ప్రకారం ఎవరు కూడా వ్యక్తిగత సమాచారం సెల్ఫోన్ లాంటివి అడగవద్దని అంటున్నారు.. అంతే కాదు.. అసలు తన సెల్ ఫోన్ ఏసీబీ వాళ్లకు ఎందుకు అవసరం ఉందో అనే విషయాన్ని చెప్పడం లేదని అంటున్నారు.. దానికి తోడు తన సెల్ ఫోన్‌తో వాళ్లకు ఏమీ పని అని ప్రశ్నిస్తున్నారు.. ఏది ఏమైనా తాను మాత్రం సెల్ఫోన్ ఇచ్చేది లేదని అంటూనే, మరొకవైపు ఈ ఏడాది నుంచి తాను కొత్త సెల్ ఫోన్ వాడుతున్నట్లు తెలిపారు.. 2021-2023 మధ్యకాలంలో కేటీఆర్ వాడిన సెల్ఫోన్ ఇవ్వాలని ఏసీబీ అధికారులు ఆదేశించారు.. అయితే ఆ కాలంలో వాడిన సెల్ ఫోన్ తన దగ్గర లేదని ఇప్పుడు కొత్త సెల్ ఫోన్ వాడుతున్నానని చెప్పారు.. సెల్ ఫోన్ ఇవ్వడానికి అసలు కేటీఆర్ ఎందుకు వెనుక ముందు ఆడుతున్నాడో అర్థం కావడం లేదని ఏసీబీ అధికారులు చెప్తున్నారు.. సెల్ఫోన్ ఇస్తే తమకు కావాల్సిన సమాచారాన్ని తీసుకుంటామని వాళ్లు వాదిస్తున్నారు..ఫార్ములా ఈ కార్ రేస్ సంబంధించిన వ్యవహారాలు అన్నీ కూడా విచారించాలంటే సెల్ ఫోను ఒక సాక్ష్యంగా తమకు ఉపయోగపడుతుందని తప్పనిసరిగా కేటీఆర్ దానిని తెచ్చి ఇవ్వాల్సిందేనని ఎసిబి అధికారులు వాదిస్తున్నారు.. ఈ సెల్ ఫోన్ ద్వారానే ఫార్ములా ఈ కార్ రేస్ అధికారులతో సంప్రదింపులు జరిపారని, అంతే కాకుండా డబ్బులు మొత్తం కూడా ట్రాన్స్ఫర్ వ్యవహారం సంబంధించిందానే జరిగిందని, హెచ్ఎండిఏ అధికారులు కూడా ఈ సెల్ఫోన్ ద్వారానే ఆదేశాలు ఇచ్చారని, కాబట్టి ఈ సెల్ ఫోన్లో కొంత సమాచారం దొరుకుతుందని కావున సెల్ఫోన్ మాకు ఇవ్వాలని ఏసిబి పట్టు పడుతుంది.. కేటీఆర్ ఇచ్చిన సమాధానంతో ఏసీబీ ఏం చేయాలో ఇప్పుడు లీగల్టీవ్తో సమావేశమైంది ..లీగల్ టీం ఇచ్చే సూచన సలహాలతోటి ఏసీబీ ముందుకు వెళుతుంది..

# ముంబైని ముంచెత్తిన భారీ వర్షం



**ముంబయి,**
మహారాష్ట్ర రాజధాని ముంబయిలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. రోడ్లన్నీ జలమయంగా మారాయి. రోడ్లపై నీరు చేరడంతో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. భారీ వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఎవరు బయటకు రావడంలేదు. వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. బుధవారం సాయంత్రం నుండి ఇప్పటివరకు 200 మి.మీ. వర్షపాతం నమోదైందని వెల్లడించింది. ముంబయి, పరిసర ప్రాంతాలకు ఐఎండి ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. భారీ వర్షాల కురస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమయితే తప్ప బయటకు రావద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నీటి మట్టం పెరుగుతుండడంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రజలు అధికారిక సూచనలను పాటించడంతో పాటు అపోహలకు లోనుకావొద్దని హెచ్చరికలు జారీ చేశారు.


# ప్రియుడితో హోటల్‌లో భార్య శృంగారం

## భర్త రావడంతో గది నుంచి దూకి పారిపోయిన భార్య



**లక్నో,**
హోటల్ రూమ్‌లో ప్రియుడితో ఉండగా భర్త రావడంతో భార్య భవనం పైనుంచి కిందికి దూకి పారిపోయింది. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం బాగ్‌పత్ జిల్లాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బడౌత్ పట్టణంలో శోభిత్ అనే వ్యక్తి తన ప్రియురాలుతో కలిసి హోటల్ రూమ్‌కు వచ్చాడు. అదే సమయంలో హోటల్‌కు భర్త రావడంతో భార్య గమనించింది. హోటల్ భవన పైనుంచి దూకి పారిపోయింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. భార్య, ఆమె ప్రియుడితో తనకు ప్రాణహాని ఉందని స్థానిక పోలీస్ స్టేషన్‌లో భర్త ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని భార్యకు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఈ దంపతులకు 2019లో వివాహం జరగగా ఒక కుమారుడు ఉన్నాడు.

# మరోసారి పేలిన స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్..



**న్యూఢిల్లీ**
ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అంతరిక్ష రంగంలో క్రమంగా పురోగతి సాధిస్తున్న ఆయనకు చెందిన స్పేస్‌ఎక్స్ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రయోగాలు వరుసగా విఫలమవుతున్నాయి. తాజాగా స్పేస్‌ఎక్స్ స్టార్‌షిప్ మరోసారి పేలింది.టెక్సాస్‌లోని ఎలాన్ మస్క్‌కు చెందిన పరీక్ష కేంద్రం వద్ద బుధవారం రొటీన్ స్టాటిక్ ఫైర్ టెస్ట్ నిర్వహించారు. ఈ క్రమంలో అది ఉన్నట్టుండి పేలిపోయింది. ఈ విషయాన్ని స్పేస్‌ఎక్స్ ఎక్స్ వేదికగా ధ్రువీకరించింది. బుధవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇది జరిగిందని పేర్కొంది. స్టార్‌షిప్ 10వ విమాన పరీక్షకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ ప్రమాదం జరిగిందని వెల్లడించింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని, అధికారులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు తెలిపింది. ప్రమాదానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

# ఆస్పత్రి నుంచి సోనియా డిశ్చార్జి

## – ఉదర సమస్యలతో నాలుగు రోజులుగా వైద్య సేవలు

**న్యూఢిల్లీ**
కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు ఉదర సమస్యలతో బాధపడుతున్న ఆమె ఈనెల 15న ఢిల్లీలోని సర్ గంగారాం ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. నాలుగు రోజులుగా చికిత్స పొందిన సోనియా గాంధీ ఆరోగ్యం మెరుగుపడటంతో గురువారం డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండడంతో డిశ్చార్జి చేసినట్టు ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు.

# థగ్ లైఫ్ రిలీజ్ బాధ్యత కర్నాటకదే

## – సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ**
కమల్‌హాసన్ నటించిన థగ్ లైఫ్ సినిమాను కర్నాటకలో రిలీజ్ చేయాల్సిందే అని, అది ప్రభుత్వ బాధ్యత అని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఫిల్మ్‌ను రిలీజ్ చేయాల్సిన బాధ్యత రాష్ట్రానిదే అని కోర్టు చెప్పింది. సినిమా రిలీజ్‌ను అడ్డుకుంటామని బెదిరిస్తున్న వారిని నియంత్రించాలని, దీనిపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సుప్రీంకోర్టు తెలిపింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. కేసు వాదనల సమయంలో కర్నాటక సర్కారు ఇచ్చిన హామీలను ధర్మాసనం ఆలకించింది. ఒకవేళ ఎవరైనా సినిమాను అడ్డుకుంటే వారిపై కర్నాటక సర్కారు తీవ్ర చర్యలు తీసుకుంటుందని సుప్రీం తెలిపింది. ఒకవేళ థగ్‌లైఫ్ సినిమా రిలీజైతే .. థియేటర్లకు రక్షణ కల్పించనున్నట్లు కర్నాటక ప్రభుత్వం కోర్టు చెప్పింది. థగ్ లైఫ్'మూవీ జూన్ 5న కర్ణాటకలో విడుదల కావాల్సి ఉంది. కానీ కన్నడ భాష "తమిళం నుండి పుట్టింది" అని కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యతో వివాదంలో చిక్కుకుంది. చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్య, ముఖ్యంగా కన్నడ అనుకూల వర్గాలలో ఆగ్రహాన్ని రేకెత్తించింది. పలు సంఘాలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి.

# బలప్రయోగం చేయవద్దు..

## అమెరికాకు చైనా వార్నింగ్



**బీజింగ్**
ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా జోక్యంపై చైనా మండిపడింది. బలప్రయోగం చేయవద్దని వార్నింగ్ ఇచ్చింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ సైనిక దాడులకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మద్దతు ఇచ్చారు. అలాగే రాజీకి రావాలని ఇరాన్‌ను ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో చైనా స్పందించింది. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి గువో జియాకున్ మీడియాతో మాట్లాడారు. అమెరికా ద్వారా జరిగే ఏదైనా బలప్రయోగం ఇరాన్ సార్వభౌమాధికారం, భద్రతను ఉల్లంఘించినట్లుగా పరిగణిస్తామని తెలిపారు. 'ఇతర దేశాల సార్వభౌమాధికారం, భద్రత, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించే అంతర్జాతీయ సంబంధాలతో కూడిన బలప్రయోగం లేదా ముప్పును కలిగించే ఏ చర్యనైనా చైనా వ్యతిరేకిస్తుంది' అని అన్నారు.కాగా, ఇరాన్‌పై ఇజ్రాయెల్ సైనిక దాడులపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కజకిస్తాన్‌లో ఐదు మధ్య ఆసియా దేశాలతో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాలు అత్యవసరంగా ఉద్రిక్తతలు తగ్గించాలని, పరిస్థితి మరింత దిగజారకుండా నిరోధించడానికి కృషి చేయాలి పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడంలో నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి చైనా సిద్ధంగా ఉందన్నారు.

# విమాన ప్రమాదంలో దెబ్బతిన్న బ్లాక్‌బాక్స్..

## విశ్లేషణ కోసం విదేశాలకు

**న్యూఢిల్లీ**
గతవారం అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో దాదాపు 270 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన యావత్తు దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. ఇక ఈ ఘటనపై అధికారులు విస్తృతంగా దర్యాప్తు చేస్తున్నారు. అయితే, దర్యాప్తులో కీలకమైన బ్లాక్‌బాక్స్ ప్రమాదంలో దెబ్బతిన్నట్లు తెలిసింది. దీంతో అందులోని డేటాను విశ్లేషించేందుకు బ్లాక్‌బాక్స్‌ను విదేశాలకు పంపనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ ఏ-171 విమానం గత గురువారం కూలిపోయిన విషయం తెలిసిందే. టేకాఫ్ అయిన నిమిషాల్లోనే రెసిడెంట్ డాక్టర్స్ హాస్టల్ భవనంపై కూలిపోయింది. ఇక ఈ ప్రమాదం జరిగిన దాదాపు 27 గంటల తర్వాత ఈ బ్లాక్‌బాక్సును




విమానం కూలిన బిల్డింగ్‌పై గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు తెలుసుకునేందుకు ఈ బ్లాక్ బాక్స్ చాలా కీలకం. అయితే, ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో బ్లాక్‌బాక్స్ దెబ్బతిన్నట్లు తెలిసింది. దీంతో అందులోని డేటాను విశ్లేషించేందుకు దెబ్బతిన్న బ్లాక్‌బాక్స్‌ను విదేశాలకు పంపనున్నట్లు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. వాషింగ్టన్ డీసీలోని జాతీయ రవాణా భద్రతా బోర్డుకు పంపే అవకాశం ఉందని సదరు కథనాలు వెల్లడించాయి. సాధారణంగా విమానం తోక భాగంలో బ్లాక్‌బాక్స్‌ను అమర్చుతారు. ప్రమాదాల్లో పేలుడు ద్వారా ఉత్పన్నమయ్యే మంటల తట్టుకునేలా, 1100 డిగ్రీ సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద గంటపాటు ఉన్నా ధ్వంసం కాకుండా వీటిని రూపొందిస్తారు. ప్రమాదానికి గల కారణం, ప్రమాదానికి ముందు ఏం జరిగింది.. తదితర సమాచారం అంతా ఈ బ్లాక్ బాక్సులో నిక్షిప్తమై ఉంటుంది. ఈ సమాచారం ద్వారా ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తారు. భవిష్యత్తు ప్రమాదాలను నిరోధించడానికి కూడా ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే, ఎయిర్ ఇండియా విమానం కూలని అనంతరం 1000 డిగ్రీల ఉష్ణోగ్రతతో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదం ధాటికి బ్లాక్‌బాక్స్ దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

# క్రొయేషియాలో మోడీకి ప్రత్యేక బహుమానం




**జాగ్రెబ్**
లండన్‌లో జరిగిన జీ-7 సదస్సుకు హాజరై తిరుగు ప్రయాణంలో క్రొయేషియాలో ఆగిన ప్రధాని నరేంద్ర మోడీ ఆ దేశ ప్రధాని ఆంద్రెస్ ప్లెంకోవిక్ నుండి 'ప్రత్యేక బహుమతి' అందుకున్నారు. వెజ్డిన్ సంస్కృత వ్యాకరణం యొక్క పునర్ముద్రణను మోడీకి ఆంద్రెస్ అందజేశారు. ఈ వ్యాకరణానికి సాంస్కృతిక ప్రాధాన్యత ఉంది. ఇది రెండు దేశాల మధ్య ఉన్న శతాబ్దాల నాటి సంబంధాలను సూచిస్తోంది. ఇది లాటిన్ భాషలో రాసిన మొట్టమొదటి ముద్రిత సంస్కృత వ్యాకరణం. 1790లో క్రోయేషియా పండితుడు, మిషనరీ ఫిలిప్ వెజ్డిన్ భారత పర్యటనలో ఉన్నప్పుడు దీనిని ప్రచురించారు. మోడీ పర్యటన సందర్భంగా ఇరువురు నేతలు వాణిజ్యం, పెట్టుబడులు, పర్యాటకం సహా ఆర్థిక సహకారాన్ని బలోపేతం చేసే అవకాశాలపై చర్చించారు. వ్యవసాయం, సంస్కృతి, సైన్స్, సాంకేతికత వంటి రంగాలకు సంబంధించిన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఆసియాలో భారత్ తమకు ముఖ్యమైన వాణిజ్య భాగస్వామి అని ప్లెంకోవిక్ తెలిపారు. ప్రతినిధి బృందం స్థాయి చర్చల నిమిత్తం భారత ప్రధాని క్రొయేషియాలో పర్యటించడం ఇదే మొదటిసారి. ద్వైపాక్షిక సంబంధాలలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నామని, వివిధ రంగాలలో సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి అనువైన పరిస్థితులను కల్పిస్తున్నామని ప్లెంకోవిక్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పెట్టిన పోస్టులో వివరించారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా తొలుత క్రొయేషియా చేరుకున్న ప్రధాని భారతీయ డయాస్పొరా సభ్యులతో ముచ్చటించారు. యూరోపియన్ యూనియన్ భాగస్వాములతో సంబంధాలను మరింత పటిష్టపరచుకోవాలన్న భారత్ సంకల్పాన్ని ఈ పర్యటన చాటిచెబుతోందని వార్తా సంస్థలు విశ్లేషించాయి.

# అహ్మదాబాద్ బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

## ఎయిరిండియా ఛైర్మన్




**న్యూఢిల్లీ**
జూన్ 12న అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కుప్పకూలిన దురదృష్టకర సంఘటనపై టాటా సన్స్, ఎయిరిండియా ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘోర ప్రమాదంలో 270 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబాలకు హృదయపూర్వక క్షమాపణలు తెలిపారు. లండన్‌కు బయల్దేరిన డ్రీమ్‌లైనర్ ఏఐ171 విమానం టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే ఒక భవనంపై కూలిపోయిన విషయం తెలిసిందే. "టాటా సంస్థ నడిపే విమానయాన సంస్థలో ఈ ప్రమాదం జరిగినందుకు తీవ్రంగా చింతిస్తున్నాను. ఈ సమయంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం. వారికి అవసరమైన సాయాన్ని అందించేందుకు కంపెనీ కట్టుబడి ఉంది. ఈ ఘటనకు గానూ బాధిత కుటుంబాలకు హృదయపూర్వకంగా క్షమాపణలు చెబుతున్నాను" అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతానికి ఈ ఘటనపై ఎలాంటి నిర్ధారణకూ రాలేము. బ్లాక్ బాక్స్, ఇతర రికార్డర్ల ద్వారా ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలుస్తాయి. అప్పటి వరకు వేచి ఉండాలి" అని చంద్రశేఖరన్ అన్నారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కూడా ఈ ఘటనపై దర్యాప్తు చేయడానికి ఒక కమిటీని నియమించిందని ఆయన వెల్లడించారు.

## సంపాదకీయం

# ధిక్కార ఉక్రెయిన్ భవిష్యత్తు ఏమిటి

రెండు దేశాల మధ్య ఘర్షణలకు, ముఖ్యంగా సాయుధ సమరాలకు కారణాలను కేవలం వర్తమానంలోనే చూడకూడదు. గత చరిత్రలోకి కూడా వెళ్ళాలి. ఇది, ప్రస్తుతం భీకర యుద్ధంలో ఉన్న ఉక్రెయిన్, రష్యా విషయంలో మరింత అవసరం. 24, ఫిబ్రవరి 2022న ఉక్రెయిన్‌పై రష్యా పెద్ద ఎత్తున సైనిక దాడిని ప్రారంభించడంతో ఆ రెండు దేశాల మధ్య ఘర్షణ పూర్తి స్థాయి యుద్ధంగా మారింది. ఈ చర్యకు ముందు - 2021 చివర, 2022 ప్రారంభంలో శిక్షణ విన్యాసాలు పేరుతో ఉక్రెయిన్ సరిహద్దుల వెంబడి 1,00,000 మందికి పైగా తన సైనికులను రష్యా సమీకరించింది. ఫిబ్రవరి 21, 2022న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఒక ప్రసంగంలో ఉక్రెయిన్‌ను సార్వభౌమ దేశంగా గుర్తించడాన్ని తిరస్కరించారు. అది సోవియట్ యూనియన్ సృష్టి అని, పశ్చిమ దేశాలు ఉక్రెయిన్‌ను రష్యాకు వ్యతిరేకంగా యుద్ధానికి రెచ్చగొడుతున్నాయని ఆరోపించారు. తూర్పు ఉక్రెయిన్‌లోని రష్యా మద్దతు గల, స్వయం -ప్రకటిత ప్రాంతాలైన డొనెట్స్క్, లుహాన్స్క్‌లను స్వతంత్ర రాష్ట్రాలుగా గుర్తిస్తున్నట్టు అదే ప్రసంగంలో ఆయన ప్రకటించారు. పిదప, మూడు రోజుల తర్వాత (ఫిబ్రవరి 24) ఉక్రెయిన్‌పై ప్రత్యేక సైనిక చర్యకు పుతిన్ ఆదేశించారు.రష్యా సైన్యం రష్యా, బెలారస్, ఆక్రమిత క్రిమియా నుంచి బహుళ దిశలలో ఉక్రెయిన్‌పై దాడి చేసింది. కీవ్, ఖార్కివ్, డాన్‌బాస్ ప్రాంతంలోని కీలక నగరాలను లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడి, 2014 నుంచి కొనసాగుతున్న సంఘర్షణను తీవ్రతరం చేసింది. నాటో, యూరోపియన్ యూనియన్‌తో ఉక్రెయిన్ సన్నిహితంగా ఉండకుండా నిరోధించడం, ఆ దేశంపై రష్యా నియంత్రణను పూర్తి స్థాయిలో స్థాపించడం అనే భౌగోళిక, రాజకీయ లక్ష్యాలు ఆ దాడి వెనుక ఉన్నాయి. ఉక్రెయిన్ లాంటి ఒక చిన్న దేశం పొరుగున ఉన్న ఒక అగ్రరాజ్యంతో తలపడటంలో (అమెరికా, ఐరోపా దేశాల మద్దతుతోనే అయినప్పటికీ) ఆ చిన్న దేశ ప్రజలు, మేధావుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవలేదు. ఇందుకు బలమైన కారణాలు తప్పక ఉంటాయి. ఈ కోణంలో చరిత్ర విలోకిస్తే ఉక్రెయిన్, రష్యాల మధ్య శతాబ్దాల ప్రగాఢ సంబంధాలు ఉన్నాయి. సాంస్కృతిక, రాజకీయ సంబంధాలూ బలంగానే ఉండేవి. అదే సందర్భంలో విభేదాలు, హింసతో కూడిన సంఘటనలు చాలానే ఉన్నాయి.ఉక్రెయిన్ 18, 19 శతాబ్దాలలో రష్యన్ సామ్రాజ్యంలో భాగమైంది. రష్యనీకరణ విధానాలు ఉక్రెయిన్ భాష, సంస్కృతుల గుర్తింపును అణచివేశాయి. రష్యన్ విప్లవం తర్వాత ఉక్రెయిన్ స్వల్పకాలం (1917-20) స్వతంత్ర దేశంగా వర్ధిల్లింది. ఆ తరువాత సోవియట్ యూనియన్‌లో బలవంతంగా చేర్చబడింది. జోసెఫ్ స్టాలిన్ హయాం (1924%-%53)లో ఉక్రెయిన్‌పై కఠిన విధానాలు అమలు చేశారు. జార్ చక్రవర్తుల వలే స్టాలిన్ కూడా ఉక్రెయిన్‌ను సోవియట్ నియంత్రణలో ఉంచడానికి, రష్యనీకరణను ప్రోత్సహించడానికి శతథా ప్రయత్నించారు. ఉక్రెయిన్ సంస్కృతి, భాష, జాతీయ గుర్తింపును అణచివేశారు. మొదటి నుంచి ఉక్రెయిన్ ప్రజలలో జాతీయవాద చైతన్యం బలంగా ఉంది. ఈ విషయాన్ని నొక్కి చెప్పేందుకు (పోలిష్ -అమెరికన్ జర్నలిస్ట్, చరిత్రవేత్త) తన రచన ఒక కవితను ఉటంకించారు: 'నేను చనిపోయినప్పుడు / నన్ను నా ప్రియమైన ఉక్రెయిన్‌లో ఖననం చేయండి/ ఒక ఎత్తైన సమాధి కొండపై/ విశాలమైన సమతల భూమిలో/ అక్కడ నా కళ్లు చూడగలవు, నా చెవులు వినగలవు/ విశాలమైన పొలాలను, అపారమైన పచ్చిక బయళ్ళను/ డ్నీపర్ నది ఒడ్డును/ గర్జించే శక్తివంతమైన నది శబ్దాన్ని'. 1920ల చివరలో స్టాలిన్ నిర్బంధ సమిష్టి వ్యవసాయ వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెట్టారు. రైతులు తమ వ్యక్తిగత భూములను వదులుకొని సోవియట్ నియంత్రిత సమిష్టి వ్యవసాయ క్షేత్రాలలో పనిచేయవలసి వచ్చింది. ఇందుకు వ్యతిరేకించిన రైతులను, ముఖ్యంగా 'కులక్స్' అని పిలిచే సంపన్న రైతులను వర్గ శత్రువులుగా చిత్రీకరించి, వారి భూములు, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. వేలాది రైతులను సైబీరియాకు బహిష్కరించారు. మేధావులు, రచయితలు, సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను వ్యతిరేకించిన రాజకీయ నాయకులను సోవియట్ వ్యతిరేకులుగా ముద్రించి అరెస్టు చేశారు. చాలా మందిని హత్య చేశారు. సోవియట్ యూనియన్ పారిశ్రామికీకరణకు నిధులు సమకూర్చడానికి ఉక్రెయిన్ నుంచి భారీ మొత్తంలో ధాన్యాన్ని సేకరించారు, దీనివల్ల స్థానిక రైతులకు ఆహార కొరత ఏర్పడింది. 1932-33లో స్టాలిన్ విధానాల ఫలితంగా హోలోడోమోర్ అనే భయంకరమైన కృత్రిమ కరువు ఉక్రెయిన్‌లో సంభవించింది. 'హోలోడోమోర్ 'అనే పదానికి ఉక్రెయిన్ భాషలో అర్థం 'ఆకలితో చావు' . ఇది 1932 నుంచి 1933 మధ్య సోవియట్ ఉక్రెయిన్‌లో సంభవించిన ఒక మహా కాటకం. ఈ విపత్తులో 35 నుంచి 50 లక్షల వరకు ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఇది సహజ విపత్తు కాదని, జోసెఫ్ స్టాలిన్ నేతృత్వంలోని సోవియట్ పాలకుల విధానాల ఫలితంగా సృష్టించబడిన విపత్తుగా చరిత్ర గుర్తించింది. దీనిని కొంతమంది చరిత్రకారులు జాతి నిర్మూలన గా ప్రకటించారు స్టాలిన్ ప్రవేశపెట్టిన సమిష్టి వ్యవసాయ విధానంవల్ల ఉత్పత్తి తగ్గినప్పటికీ, సోవియట్ అధికారులు అసాధారణంగా అధిక ధాన్య సేకరణ కోటాలను విధించారు. కోటాలను పరిపూర్తి చేయలేని గ్రామాల నుంచి ధాన్యాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు. రైతులను ఆహారం లేకుండా వదిలేశారు. ఉక్రెయిన్ గ్రామాలను 'బ్లాక్‌లిస్ట్' చేసి, ఆహార సరఫరాను నిషేధించారు. ఈ కరువు ఉక్రెయిన్ జాతీయవాదాన్ని అణచివేయడానికి, సోవియట్ నియంత్రణను బలోపేతం చేయడానికి ఉద్దేశపూర్వకంగా ఉపయోగించబడిందని చరిత్రకారులు భావిస్తారు. ఈ కరువు వల్ల గ్రామాలు ఖాళీ అయ్యాయి. వేలాది కుటుంబాలు ఆకలితో మరణించాయి. ఉక్రెయిన్ సమాజంపై ఈ కరువు దీర్ఘకాలిక ప్రభావం చూపింది. ఉక్రెయిన్లలో రష్యాపై ద్వేషం, స్వీయ జాతీయతా చైతన్యం బలపడ్డాయి. కరువు వల్ల ఆహారం దొరకక కొంతమంది ఉక్రెయిన్ ప్రజలు బతకడానికి నరమాంస భక్షణకు పాల్పడ్డారు. సోవియట్ పోలీసు ఆర్కైవ్‌లు ఆకలితో పిచ్చివాళ్లైన వ్యక్తుల వైనాలు, క్షుధార్తులు శవాలను తిన్న సందర్భాలను రికార్డు చేశాయి. కొంతమంది తమ సొంత పిల్లలను తిన్న సందర్భాలూ ఉన్నాయి! తమని తినేస్తారని పిల్లలు తల్లిదండ్రులనుంచి పారిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి

# బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌నుఅడ్డుకోండి..

- తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రతిపాదనలు
- చట్ట ఉల్లంఘనలకు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
- కేంద్రం సానుకూలంగా స్పందించకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం
- గోదావరిలో వెయ్యి, కృష్ణాలో 500 టీఎంసీల వినియోగానికి ఎన్వోసీ ఇవ్వండి
- పెండింగ్ ప్రాజెక్టుల సంగతి చూడండి : కేంద్ర జలశక్తి మంత్రికి సీఎం విజ్ఞప్తి



**న్యూఢిల్లీ**

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ (ఏపీ) ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్ (సాధ్యాసాధ్యాల నివేదిక)ను తిరస్కరించాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్-1980 (జీడబ్ల్యూడీటీ), ఏపీ పునర్విభజన చట్టం-2014కు విరుద్ధంగా ఏపీ వ్యవహరిస్తుందని ఫిర్యాదు చేశారు. గురువారంనాడిక్కడ శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. దాదాపు గంటపాటు సాగిన ఈ సమావేశంలో బనకచర్ల ప్రాజెక్టు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక, పర్యావరణ శాఖలు వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయని ఈ సందర్భంగా వారు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదిస్తున్నామని ఏపీ చెబుతోందని, జీడబ్ల్యూడీటీ-1980లో వరద జలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదన్నారు. 2014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్ట్ నిర్మించాలనుకుంటే ముందు ఆ నదీ యాజమాన్య బోర్డు, సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), జలశక్తి మంత్రి అధ్యక్షతన ఇరు రాష్ట్రాల సీఎంలు సభ్యులుగా ఉండే ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాల్సి ఉంటుందని గుర్తు చేశారు. అయితే బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో ఏపీ సర్కార్ ఈ నిబంధనలను ఉల్లంఘిస్తుందన్నారు. ఈ విషయంలో కేంద్రం, జలశక్తి మంత్రిత్వ శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్ట్ ముందుకెళ్లకుండా అడ్డుకోవాలని కోరారు.

**బనకచర్లకు బదులు**

సీడబ్ల్యూసీ పరిధిలోని సాంకేతిక సలహా మండలి నుంచి అనుమతులు పొందకుండానే వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి లిఫ్ట్ స్కీంలను ఏపీ చేపట్టిందని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. జీడబ్ల్యూడీటీ-1980 నిబంధనల ప్రకారం పోలవరం డిజైన్లు మార్పు చేసిందనీ, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతున్నదనీ, తాము అభ్యంతరాలు లేవనెత్తినా పనులు మాత్రం కొనసాగిస్తూనే ఉన్నారని ఫిర్యాదు చేశారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం విషయంలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించకుండా కేంద్ర ప్రభుత్వం దష్టి సారించాలని కోరారు. గోదావరిలో వరద జలాలున్నాయని నిజంగా ఏపీ భావిస్తే, పోలవరం-బనకచర్లకు బదులు కేంద్రం నిధులు ఇచ్చే ఇచ్చంపల్లి-నాగార్జునసాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్లు తీసుకెళ్లే విషయంలో చర్చకు తాము సిద్ధమని స్పష్టం చేశారు. కష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 తీర్పు త్వరగా వెలువడేలా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తాము ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడబోమని, అన్ని వేదికల ద్వారా సమస్యలు సామరస్యపూర్వకంగా పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. కేంద్ర స్పందన అనుకూలంగా లేకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని కేంద్ర మంత్రికి తేల్చిచెప్పారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు
రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**అనుమతులివ్వండి**

తెలంగాణకు గోదావరి నదిలో వెయ్యి టీఎంసీలు, కష్ణా నదిలో 500 టీఎంసీలు మొత్తంగా 1500 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఏపీ నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) జారీ చేయాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ 1,500 టీఎంసీల నీటితో కోటిన్నర ఎకరాలకు నీరు అందుతుందన్నారు. ఏపీ సర్కార్ చేపడుతోన్న ప్రాజెక్టుల అనుమతి ప్రక్రియలో వేగంగా వ్యవహరిస్తోన్న కేంద్రం, తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో అలసత్వం ప్రదర్శించడం సరికాదన్నారు. దీనవల్ల ఇరు రాష్ట్రాల మధ్య అపోహలు, ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క-సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతో పాటు అన్ని రకాల అనుమతులను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బనకచర్లకు డీపీఆర్ తమకు అందలేదని కేంద్ర మంత్రి తెలిపారనీ, త్వరలోనే ఇరు రాష్ట్రాల సీఎంలతో కలిసి ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అలాగే మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో ఎంపీలు మల్లు రవి, రఘువీర్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉత్పల్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగంలో ఏఐ వినియోగం

**- నెదర్లాండ్ కంపెనీ ప్రతినిధులతో తుమ్మల భేటీ**



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు
రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



**హైదరాబాద్**

వేగంగా పెరుగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయరంగాన్ని ఆధునికీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇదే అంశంపై గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నెదర్లాండ్ కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమావేశమయ్యారు. తమ సంస్థ ద్వారా రైతులకు ఒకేసారి సమాచారాన్ని అందించడం, రైతుల ఫిర్యాదులకు ఏఐ ఆధారంగా తక్షణం సూచనలు ఇవ్వడం వంటి సౌకర్యాలు కల్పిస్తామని కంపెనీ ప్రతినిధులు మంత్రికి తెలియజేశారు. సమావేశంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయ డైరెక్టర్ గోపి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**వ్యవసాయ యాంత్రీకరణకు రూ.104 కోట్లు : మంత్రి తుమ్మల వెల్లడి**

రాష్ట్రంలో వానాకాలానికి (2025-26) వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని వెంటనే ప్రారంభించాలంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. అందుకు రూ. 104 కోట్లు కేటాయిం చామని తెలిపారు. నియోజకవర్గాల వారీ వ్యవసాయ పనిముట్లు, యంత్రాల కేటాయింపులు చేయడంతోపాటు వాటిని వెంటనే సరఫరా చేయాల్సిందిగా ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాల యంలో యాంత్రీకరణపై మంత్రి సమీక్షించారు. ఈ పథకంలో సన్న, చిన్నకారు, మహిళా రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా 'నమో డ్రోన్ దీదీ' కింద సరఫరా అయ్యే 381 డ్రోన్లను మహిళా సంఘాలకు అందించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలపై జాతీయ ధరల నిర్ణయక కమిషన్ దక్షిణ ప్రాంతీయ సమావేశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు.

# ఓటర్ ఐడీ కార్డులు...
# ఎన్నికల సంఘం కీలక ప్రకటన..!!






తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**హైదరాబాద్ :ప్రజా స్వేచ్ఛ**
ఓటర్లకు ఐడీ కార్డులు త్వరితగతిన అందించేందుకు కొత్త విధానాన్ని ప్రారంభించినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఎన్నికల రిజిస్టర్లో దరఖాస్తుకు సంబంధించిన మార్పులు జరిగిన 15 రోజుల్లోపే ఓటర్ ఐడీ కార్డులు (EPIC) ఓటర్లకు చేరేలా ఈ కొత్త విధానం తీసుకొచ్చినట్లు పేర్కొంది.కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకున్న వారితో సహా, ఇప్పటికే ఉన్న ఓటరు వివరాల్లో మార్పులు చేసిన వారికి కూడా 15 రోజుల్లోనే కార్డును డెలివరీ చేస్తామని వెల్లడించింది.ప్రస్తుతం ఓటర్లకు ఓటర్ ఐడీ కార్డులు అందడానికి ఒక నెలకు పైగా సమయం పడుతోందని అధికారులు చెబుతున్నారు. అయితే, ఈ కొత్త వ్యవస్థ ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేయబోతున్నారు. ఈ కొత్త విధానంలో, ఓటర్ కార్డు తయారవడం నుంచి ఓటరుకు అందే వరకు ప్రతి దశలో పర్యవేక్షించడం కోసం రియల్ టైమ్ ట్రాకింగ్ వ్యవస్థను తీసుకొచ్చినట్లు ఈసీ వివరించింది. ఈ ప్రక్రియను ఎన్నికల రిజిస్ట్రేషన్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారు. అంతేకాక, ప్రతి దశలో ఓటర్లకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందేలా ఏర్పాట్లు చేశారు. తద్వారా ఓటర్లు తమ ఓటర్ ఐడీ కార్డు స్థితిని తెలుసుకోవడానికి వీలవుతుంది.

# పాఠశాలలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**వలిగొండ,ప్రజా స్వేచ్ఛ...**
భావి భారత ప్రధాని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ లోకసభ ఫ్లోర్ లీడర్ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు వలిగొండ (మల్లేపల్లి) గ్రామంలో గురువారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రాథమిక కోన్నత పాఠశాల పిల్లలకు నోట్ బుక్స్,పెన్నులు,పండ్లు పంపిణీ చేయటం జరిగింది.మాట్లాడుతూ స్థానిక భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరిపాలనలో భువనగిరి ఎంతో అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గంలో ప్రతి పాఠశాలకు ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నారు అని పిల్లలకు వివరించటం జరిగింది.విద్యార్థిని విద్యార్థులు ముందు ముందు ఇంకా పై చదువులు చదువుకొని మంచి ఉన్నత స్థాయిలో ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వలిగొండ ఎం ఈ ఓ సుంకోజు భాస్కర్,పాఠశాల చైర్మన్ సుంకోజు చంద్రమౌళి ఉపాధ్యాయులు కిరణ్, అసెంబ్లీ యూత్ ప్రధాన కార్యదర్శి బుగ్గ ఉదయ్, ఉపాధ్యక్షులు మచ్చగిరి,ప్రధాన కార్యదర్శి తోట సాయి, సోమేశ్,అరుణ్, దుర్గ,వినోద్,బిక్షపతి,భార్గవ్,రవి యూత్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పూజల హరికృష్ణ నివాసం లో భోజనం చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్...



**సిద్దిపేట,ప్రజా స్వేచ్ఛ...**
రాష్ట్ర బీసీ సంక్షేమ మరియు రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ కరీంనగర్ వెళ్తూ సిద్దిపేట లో ఆగి సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ నివాసం లో విందు ను స్వీకరించారు, ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సిద్దిపేట లో హరికృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రోజు రోజు కు బలేపేతం అవుతందని ప్రశంషిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలలో తీసుకుపోవాలని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ స్థానాలని గెలువాలని కోరారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్, సీనియర్ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు బొమ్మల యాదగిరి, రాష్ట్ర మైనారిటీ నాయకులు కలీముద్దీన్ అహ్మద్,డీసీసీ మహిళా అధ్యక్షులు ముద్దం లక్ష్మి,కౌన్సిలర్ సాకి ఆనంద్, రియాజుద్దీన్, అలకుంట మహేందర్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు గోపిక్రిష్ణ, యూత్ కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షులు వాహబ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పయ్యావుల సందీప్ యాదవ్, దేశెట్టి నరేష్,చెంది శ్రీనివాస్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షులు అజమాత్, వర్కింగ్ ప్రెసిడెంట్ రషద్, అతీఫ్,తదితరులు పాల్గొన్నారు.

# అక్కన్నపేట మండలం లో ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు





**-పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన అక్కన్నపేట మండల బీసీ సెల్ అధ్యక్షులు చింతల బాలరాజు**

**సిద్దిపేట,ప్రజా స్వేచ్ఛ**
ఈ సందర్భంగా హుస్నాబాద్ వ్యవసాయం మార్కెట్ డైరెక్టర్లు మరియు హుస్నాబాద్ సొసైటీ డైరెక్టర్లు మాట్లాడుతూ భారత దేశం కోసం ప్రాణాలర్పించిన కుటుంబం నుండి ఈరోజు భారత దేశ అభివృద్ధి కోసం పరితపించే నాయకుడు,భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ అని అన్నారు.ఈరోజు అక్కన్నపేట మండలం లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ లో ప్రతిపక్ష నాయకులు గా రాహుల్ గాంధీ అధికార బీజేపీ ప్రభుత్వం ను తనదైన శైలిలో ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు రాబోయే కాలం లో భారత దేశానికి కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ అని అన్నారు, తన నానమ్మ ఇందిరా గాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాత సోనియా గాంధీ సూచనలు, సలహాలతో రాహుల్ గాంధీ రాణిస్తున్నారని ఖచ్చితంగా భారత దేశానికి ప్రధాని అవుతారని ఆయన అన్నారు. రాహుల్ పట్టుదల తో తెలంగాణ లో కులగణన జరిగింది అని అన్నారు.బడుగు బలహీన వర్గాల కోసం పని చేస్తున్నా పార్టీ కాంగ్రెస్ మాత్రమే అని ఆయన అన్నారు.
ఈ కార్యక్రమం లో సొసైటీ డైరెక్టర్లు బుర్ర ప్రభాకర్ గౌడ్, బండి కుమార్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, ప్రతిపక త్రిమూర్తి, కరెంటోత్ రవి, అక్కన పేట మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి, ఓయూ జేఏసీ నాయకులు గంపల శ్రీనివాస్, బెజ్జంకి సారయ్య, మహమ్మద్ అక్బరుద్దీన్, లింగంపల్లి సారయ్య,కాశ బోయిన రవి,పులికాస్ రమేష్,బందరం శ్రీనివాస్,పంగ రాకేష్,రాజిరెడ్డి,రాజు నాయక్, నాగరాజ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నేతాజీ పాఠశాలలో ఘనంగా జాతీయ పఠన దినోత్సవం... బీసీ నాయకులు



**మిర్యాలగూడ, ప్రజా స్వేచ్ఛ...**
నేడు జాతీయ పఠన దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలో నేతాజీ హై స్కూల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీపతి శ్రీనివాస్ విద్యార్థులతో జాతీయ పఠన దినోత్సవం పురస్కరించుకుని వారు మాట్లాడుతూ, పుస్తకాలతో స్నేహం పెంచుకోనీ, పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఒక పుస్తకం అనేది 100సంవత్సరాలు అనుభవంతో సమానమని, నేటి యుగంలో పాఠ్యపుస్తకాలు క్షుణ్ణంగా చదివితేనే కాంపిటేటివ్ పరీక్షల్లో ఉత్తీర్ణులవుతారనీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా బీసీ రాజ్యాధికార సమితి పట్టణ అధ్యక్షుడు చేగొండి మురళీ యాదవ్, బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి దాసరాజు జయరాజు, మరియు ఉపాధ్యాయులు రమావత్ భీమ్లా, నూరి బేగం, అలివేలు, ధరావత్ సునీత, దేవకి కళ్యాణి, జబీన్, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు

# గ్రంథాలయాల్లో ఖాళీలను భర్తీ చేయాలి

**– ఎండి జహంగీర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు**



**భువనగిరి,ప్రజా స్వేచ్ఛ**
సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉన్న గ్రంధాలయాన్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 16 గ్రంథాలయాలు ఉన్నాయి, ఈ గ్రంథాలయాల్లో 23 పోస్టులకు గాను కేవలం ఐదు పోస్టులు భర్తీ కాగా 18 స్థానాలు ఖాళీగా ఉన్నాయని వారు అన్నారు. వెంటనే ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రంథాలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది అని చాలాచోట్ల గ్రంథాలయాలను అవుట్సోర్సింగ్ వారు నిర్వహిస్తున్నారు అని గ్రేడ్ 3 లైబ్రేరియన్ పోస్టులు 14 గాను 11 ఖాళీలు ఉన్నాయని వారు అన్నారు. ఈ స్థితిలో గ్రంధాలయాలను మెరుగుపరచడం సాధ్యం కాదని గత టీఆర్ఎస్ పరిపాలనలో ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కూడా ఇదే దుస్థితి కొనసాగుతుందని దీనికి ప్రధాన కారణం సకాలంలో నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వివరించడమే అని వారు అన్నారు. చాలామంది నిరుద్యోగులు గ్రంథాలయాల్లో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు కానీ సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న స్థితి ఉన్నది జిల్లా కేంద్రం గ్రంథాలయంలో సౌకర్యవంతమైన కుర్చీలు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు జిల్లా గ్రంథాలయంలో డిజిటల్ లైబ్రరీని అందుబాటులో ఉంచాలని వారు కోరారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న లైబ్రరీలను అధునాతనమైన పద్ధతిలో తీర్చిదిద్దాలని వారు డిమాండ్ చేశారు గ్రంధాలయాల్లో ఉన్న సమస్యలపై సిపిఎం తరపున రాష్ట్ర ప్రభుత్వానికి వినతులు అందజేస్తామని వారు తెలిపారు వీరితోపాటు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, బోలగాని జయరాములు, మద్దెపురం రాజు, గడ్డం వెంకటేష్, నాయకులు పల్లెర్ల అంజయ్య, అన్నంపట్ల కృష్ణ, వడ్డేబోయిన వెంకటేష్, లావుడియా రాజు, ప్రకాష్, ఓవల్దాస్ అంజయ్య, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాల బస్సుకు ఫిట్నెస్ తప్పనిసరి

**-జహీరాబాద్ ఎంవీఐ మహేశ్వరం వెంకటయ్య**




నారాయణఖేడ్,ప్రజా స్వేచ్ఛ...
నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని ప్రతి ప్రైవేట్ పాఠశాల బస్సు ఫిట్నెస్ గా ఉండాలని, తప్పనిసరిగా రినివల్ చేసుకొని, పొల్యూషన్ పరీక్షలు చేయించి సర్టిఫికెట్ పొందాలని జహీరాబాద్ ఎంవీఐ మహేశ్వరం వెంకటయ్య అన్నారు. గురువారం నారాయణఖేడ్ పట్టణంలోని ఎంవీఐ కార్యాలయంలో ప్రైవేట్ స్కూల్ బస్సులను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్,నారాయణఖేడ్ పట్టణాలలోని ప్రైవేట్ పాఠశాలల సుమారుగా 200 బస్సులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఫిట్నెస్ లేకుండా రోడ్డుపై బస్సులు నడిపితే సీజ్ చేస్తామన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపరాదని,డ్రైవర్ కు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని,ప్రతీ గురువారం వాహదారుల సౌకర్యం కోసం ఖేడ్ లోని రైతు బజార్ లోని కార్యాలయంలో రినివల్,ఇతర సౌకర్యాలు కల్పించడం జరుగుతుంది కాబట్టి ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అన్నారు.

## పటిష్టమైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు సమాజాన్ని రక్షించడంలో ఎంతో దోహదపడతాయి.

**-ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు.**





మెదక్ జిల్లా,ప్రజా స్వేచ్ఛ...
మెదక్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, కోవిడ్ వార్డును ఎమ్మెల్యే సంబంధిత ఆసుపత్రి సూపరిండెంట్ డా. ఎ. సునీత దేవి, ప్రొఫెసర్ డా. లోకేష్ ఇతర వైద్యాధికారులు వైద్య సిబ్బందితో కలిసి మెదక్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జి జి ఎచ్ )లో నూతనంగా ఏర్పాటు చేసిన కోవిడ్ వార్డును లాంఛనంగా ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందని తెలిపారు.12 ఐసోలేటెడ్ పడకలతో కూడిన ఈ వార్డు, ప్రారంభించడం జరిగిందని, ఈ ప్రాంతంలో కోవిడ్ సంబంధిత కేసుల పునరుద్ధరణను ఎదుర్కోవడానికి ఒక ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.తద్వారా ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి మరియు ప్రజారోగ్య అత్యవసర పరిస్థితుల కోసం నిర్ధారించడానికి వైద్య ఆరోగ్యశాఖ పనిచేస్తుందన్నారు పేర్కొన్నారు. అంకితభావంతో ప్రజారోగ్య పరిరక్షణకు విస్తృత సేవలు అందిస్తున్న వైద్యులు, నర్సులు మరియు ఆసుపత్రి సిబ్బంది. అంకిత భావాన్ని ప్రశంసించారు ప్రజారోగ్యంపై అప్రమత్తత, సకాలంలో చర్యలు మరియు పటిష్టమైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు సమాజాన్ని రక్షించడంలో చాలా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.నూతనంగా ప్రారంభించబడిన ఈ వార్డు ఇప్పుడు పూర్తిగా పనిచేస్తోంది మరియు రోగులు మరియు వైద్య సిబ్బంది భద్రత మరియు శ్రేయస్సును నిర్ధారించడానికి వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## బెస్ట్ అవైలబుల్ స్కీం పెండింగ్ నిధులు విడుదల చేయాలి

**-ఎస్ఎఫ్ఐ గిరిజన సంఘం కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ వీర బ్రహ్మాచారికి వినతిపత్రం అందజేత**

**-తక్షణమే పెండింగ్ నిధులు విడుదల చేయకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం**



మహబూబాబాద్, ప్రజా స్వేచ్ఛ...
మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ స్కీం కింద పెండింగ్లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంఘం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భూక్య హరినాయక్, పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ వీర బ్రహ్మాచారికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు సంవత్సరాలుగా బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులు పెండింగ్లో ఉండడం వల్ల ఎస్సీ ఎస్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చాలా ప్రైవేట్ పాఠశాలల్లో నిధులు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గత మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న పెండింగ్ నిధులను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు లేనియెడల రాబోయే రోజుల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు బానోత్ వెంకన్న ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు గంధసిరి జ్యోతి బస్సు కెవిపిఎస్ జిల్లా నాయకులు పందుల మహేందర్ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు గుండ్ల రాకేష్ దిలీప్ మహేష్ వినయ్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి భవిత కేంద్రాలలో చేర్పించాలి

**మిర్యాలగూడ పట్టణంలో భవిత కేంద్రాన్ని అందంగా తీర్చిదిద్దడం పట్ల సబ్ కలెక్టర్ అభినందించిన కలెక్టర్ ఇలా త్రిపాటి**



మిర్యాలగూడ,ప్రజా స్వేచ్ఛ...
నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో భవిత కేంద్రాలలో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలందరినీ నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. గురువారం ఆమె నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి భవిత కేంద్రంలో చేర్పించాలని భవిత కేంద్రాల ద్వారా వీరికి కృత్యాధార పద్ధతులలో విద్యను అందించడం జరుగుతుందని, అంతేకాక వారి మానసిక పరమైన లోపాలను సరిదిద్దుచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు తదుపరి విడతలో విద్యాశాఖ ద్వారా పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతి పాదనులను పంపిస్తామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలో భవిత కేంద్రాన్ని అందంగా తీర్చిదిద్దడం పట్ల మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ విద్యా శాఖ అధికారులను ఆమె అభినందించారు. జిల్లా కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ డి ఈ ఓ బిక్షపతి స్థానిక విద్యాశాఖ అధికారులు ఇతర అధికారులు ఉన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు.

**రక్తదానం చేసేందుకు భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు.**



మహేశ్వరం,ప్రజా స్వేచ్ఛ...
మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుభాన్ యాదవ్ ఆధ్వర్యంలో భావి భారత ప్రధానమంత్రి, ఎంపీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా రక్తదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా హస్తం పార్టీ నేతలు తరలి వచ్చి రక్తదానం చేసేందుకు భారీగా ముందుకు వచ్చారు. రెండు పర్యాయాలు ప్రధాని పదవిని త్యాగం చేసిన ఘనత రాహుల్ గాంధీకి దక్కుతుందన్నారు.దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా దేశ వ్యాప్తంగా ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు భారత్ జోడో యాత్ర పేరుతో పాదయాత్ర చేసిన ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని అన్నారు.భారత దేశ ప్రజలను ఏకం చేయడం వారి సమస్యలను వినడం లక్ష్యంగా పెట్టుకొని యాత్రను విజయవంతం చేసుకుని, కోట్ల మంది గుండెల్లో ధైర్యం అనే జెండాను నాటి అండగా నిలుస్తున్న భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు,యువ నాయకుడు,రాహుల్ గాంధీ అని అన్నారు. ఈ దేశంలోని చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగం,రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి, టిపిసిసి ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య, నియోజకవర్గం ఎస్సీ సెల్ చైర్మన్ శ్రీధర్, ఏఎంసి డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, యువజన నాయకులు పాల్గొన్నారు.

## భూ సమస్యలకు రెవెన్యూ సదస్సుల ద్వారా శాశ్వత పరిష్కారం,లభిస్తుంది

**రైతులు అందరు సద్వినియోగం చేసుకోవాలి**

**యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు**



భువనగిరి,ప్రజా స్వేచ్ఛ...
గురువారం రోజు భువనగిరి మండలం లో చీమలకొండూరు గ్రామంలో భూ భారతి రెవిన్యూ,సదస్సు లో పాల్గొని జరుగుతున్న రెవెన్యూ సదస్సు ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఆన్లైన్ లో నమోదు చేస్తున్నారా అని అధికారులను ఆరా తీశారు.వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.దరఖాస్తుల స్వీకరణ,హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.సదస్సులో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని,సాను కూలంగా ఉన్న సమస్యలను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు.భూ భారతి చట్టం లో రైతుల సమస్య లు తప్పనిసరిగా పరిస్కారం అవుతాయని తెలియజేసారు.ఈ కార్యక్రమం లో మండల డిప్యూటీ తహసీల్దార్ కోట్ల కళ్యాణ్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా.. నోట్ బుక్స్ పెన్సు పంపిణీ




మహేశ్వరం,ప్రజా స్వేచ్ఛ...
లోకసభ ప్రతిపక్ష నేత భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ జన్మదిన సందర్భంగా మహేశ్వరం మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజు గొల్లూరి ఆధ్వర్యంలో సుభాన్ పూర్ జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో కేక్ కట్ చేసి విద్యార్థులకు నోటుబుక్కులు,పెన్నులు పంచడం జరిగింది.ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఇమ్మడి ప్రవీణ్ పటేల్,కాంగ్రెస్ నాయకులు బొల్లు కుమార్,తిరుపతి రెడ్డి,రావుఫ్,యూత్ కాంగ్రెస్ నాయకులు ఆవుల రమేష్,ఏర్పుల శ్రీశైలం,నర్రా శేఖర్,నాగేందర్ నాయక్,రవి నాయక్ భాస్కర్ నాయక్,రవీందర్ నాయక్,రాజు నాయక్,గుత్తి శ్రీను మరియు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో రైతులకు న్యాయం.

**రైతులకు రైతు భరోసా వచ్చేందుకు కృషి.**

**నియోజకవర్గం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్.**



మహేశ్వరం,ప్రజా స్వేచ్ఛ...
ప్రజా ప్రభుత్వంలో రైతులకు న్యాయం జరుగుతుందని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం, కందుకూరు మండలాల రైతులకు రైతుబంధు విషయంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో భేటీ అయ్యి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ.. అర్బన్ ప్రాంతంలో భూములు ఉన్న రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని ఆయన తెలిపారు. మహేశ్వరం మండలంలో 12వేల 978 ఎకరాలు, కందుకూరులో కొంత భూమి, బాలాపూర్ మండలంలో 3 వేల ఎకరాలు అర్బన్ ప్రాంతంగా గుర్తించడం వల్ల రైతు భరోసా ఆగిందని ఆయన చెప్పారు. అర్బన్ ప్రాంతంలో ఉన్న రైతులకు రైతు బీమా, రైతు భరోసా వచ్చే విధంగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రైతు ప్రభుత్వంలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగనివ్వమని ఆయన తెలిపారు. రైతులు, ప్రజలు విపక్షాల మాయమాటలో పడవద్దు అని ఆయన సూచించారు.

# బిజినెస్

## మళ్లీ స్వల్పంగా తగ్గిన బంగారం.. కిలోకు రూ.1000 తగ్గిన వెండి..!

## మైక్రోసాఫ్ట్‌లో మరో రౌండ్ లేఆఫ్స్.. వేలాది మందిపై ప్రభావం..!




ఆర్థిక అస్థిరత, పెరుగుతున్న కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వల్ల టెక్ ఇండస్ట్రీలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ లాంటి దిగ్గజ కంపెనీలు వందల మంది ఉద్యోగులను ఇంటికి పంపాయి. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 130 కంపెనీలు కలిసి 61 వేల మంది ఉద్యోగులను తొలగించాయి.ఇక ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇప్పటికే వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా మరో రౌండ్ లేఆఫ్స్‌కు సిద్ధమైనట్లు తెలుస్తోంది. 2025 ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ మరోసారి ఉద్యోగుల కోతకు సిద్ధమైనట్లు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. కంపెనీ పునర్నిర్మాణంలో భాగంగా వేలాది మందిపై వేటు వేయనున్నట్లు తెలిపింది. తాజా రౌండ్ సేల్స్ విభాగంలో ఉండనున్నట్లు సంస్థ అధికారులను ఊటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. అయితే, ఈ లేఆఫ్స్‌పై మైక్రోసాఫ్ట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. కాగా, మైక్రోసాఫ్ట్ ఈ ఏడాది మే నెల మధ్యలో వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇక ఈ ఏడాది జనవరిలో కూడా పనితీరు ఆధారంగా కొంతమందిని సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. ఈనెల ఆరంభంలో కూడా పలువురిపై సంస్థ వేటు వేసింది. డైనమిక్ మార్కెట్‌లో పోటీదారుగా నిలవడానికి, కంపెనీ పునర్ నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవడానికి కోతలు తప్పడం లేదని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. 'మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తున్నాం' అని మైక్రోసాఫ్ట్ తెలిపింది.



బంగారం ధరలు కొనుగోలుదారులకు ఊరటనిచ్చాయి. గురువారం సైతం ధర తగ్గుముఖం పట్టింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గిన నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రూ.150 తగ్గి తులం రూ.1,00,560కి చేరుకుందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. అలాగే, 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.150 తగ్గి తులం రూ.99,800 పలుకుతోందని పేర్కొంది. మరో వైపు వెండి ధర సైతం భారీగా పతనమైంది. రూ.1000 తగ్గి కిలోకు రూ.1,07,200కి చేరుకుంది. ప్రపంచ మార్కెట్లలో స్పాట్ బంగారం స్వల్పంగా తగ్గి ఔన్సుకు 3,365.90 డాలర్లకు చేరింది. అదే సమయంలో స్పాట్ వెండి ఒక శాతం తగ్గి ఔన్సుకు 36.37 డాలర్లకు పడిపోయింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదని కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కైనత్ చైన్వాలా తెలిపారు. ఈ నిర్ణయం తర్వాత యూఎస్ డాలర్ బలంగా ఉన్నది. అయితే, బంగారం ధరలు ఔన్సుకు 3,390 డాలర్లకు తగ్గాయి. వడ్డీ రేట్లు తగ్గుతాయని అంచనా వేసినా.. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను సవరించేందుకు అంగీకరించలేదు. అయితే, యూఎస్ ద్రవ్య విధానానికి సంబంధించిన ఆర్థిక అంచనాలను మాత్రం సవరించింది. జూన్ టీన్త్ (యునైటెడ్ స్టేట్స్‌లో ఫెడరల్ హాలీడే) సందర్భంగా యూఎస్ మార్కెట్లు, బ్యాంకులు గురువారం మూతపడనున్నాయి. యూఎస్ ఫెడరల్ వైఖరి నేపథ్యంలో మార్కెట్‌లో బంగారం హెచ్చుతగ్గులకు గురైందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్, పరిశోధన విశ్లేషకుడు జతిన్ త్రివేది పేర్కొన్నారు. యూఎస్ వడ్డీ రేటు తగ్గింపు మరో ఆరు నెలలు వాయిదా పడిందని.. అయినా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారానికి డిమాండ్ ఉందని అభిప్రాయపడ్డారు. ఇక హైదరాబాద్‌లో బంగారం ధరలను పరిశీలిస్తే.. 22 క్యారెట్ల ధర రూ.92,650 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి రూ.1,01,080 పలుకుతోందని చెప్పింది. ఇక వెండి ధర కిలోకు రూ.1.22 లక్షలు పలుకుతున్నది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఉదయం ఫ్లాట్‌గా మొదలైన మార్కెట్లు.. పొద్దంతా ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. ఏ దశలోనూ మార్కెట్ కోలుకోలేదు. సెన్సెక్స్ క్రితం సెషన్‌తో పోలిస్తే 81,403.94 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,583.94 పాయింట్ల గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. 81,191.04 పాయింట్ల కనిష్టానికి చేరింది. చివరకు 82.79 పాయింట్లు నష్టపోయి 81,361.87 వద్ద ముగిసింది. నిఫ్టీ 18.80 పాయింట్లు పతనమై.. 24,793.25 వద్ద ముగిసింది.దాదాపు 928 షేర్లు లాభపడగా.. 2,907 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో టాటా కన్స్యూమర్, ఐషర్ మోటార్, ఎం అండ్ ఎం, విప్రో, డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లాభాలను ఆర్జించాయి. అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, అదానీ ఎంటర్‌ప్రైజెస్ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఒక్కొక్కటి 1.5 శాతం కంటే ఎక్కువగానే పడిపోయాయి. ఆటో మినహా మిగతా రంగాలన్నీ ఐటీ, మీడియా, మెటల్, రియాల్టీ, ఆయిల్, గ్యాస్, ఫార్మా, టెలికాం, పీఎస్‌యూ బ్యాంక్ 0.5-2 శాతం తగ్గడంతో నష్టపోయాయి.

## నిశాంక సూపర్ సెంచరీ.. తొలి టెస్టులో ధీటుగా బదులిస్తున్న లంక..!



స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో శ్రీలంక ధీటుగా బదులిస్తోంది. ఓపెనర్ పథుమ్ నిశాంక (187) సూపర్ సెంచరీతో విరుచుకుపడ్డాడు. గాలే మైదానంలో బంగ్లా బౌలర్లను ఉతికేసిన నిశాంక అత్యధిక వ్యక్తిగత స్కోర్ నమోదు చేయగా.. దినేశ్ చండీమాల్(54) అర్ధ శతకంతో రాణించాడు. అయితే.. మ్యాచ్‌తో వీడ్కోలు పలకనున్న ఏంజెలో మాథ్యూస్(39) నిరాశపరిచాడు. రెండో సెషన్ తర్వాత పుంజుకున్న ప్రత్యర్థి బౌలర్లు చకచకా వికెట్లు తీసి లంకను ఒత్తిడిలోకి నెట్టారు.కానీ, ఆఖరి సెషన్‌లో కమిందు మెండిస్(37 నాటౌట్), కెప్టెన్ ధనుంజయ డిసిల్వా(17 నాటౌట్)లు మరో వికెట్ పడనీయలేదు. దాంతో, మూడోరోజు ఆట ముగిసే సరికి శ్రీలంక 4 వికెట్ల నష్టానికి 368 రన్స్ కొట్టింది. ఇంకా పరుగులు 127 వెనకబడి ఉంది ఆతిథ్య జట్టు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సైకిల్ 2025-27)లో శ్రీలంక, బంగ్లాదేశ్‌లు హోరాహోరీగా తలపడుతున్నాయి. గాలే మైదానంలో రెండు రోజులు బంగ్లాదేశ్ బ్యాటర్లు పరుగుల వరద పారించిన పిచ్ మీద గురువారం శ్రీలంక బ్యాటర్లు రెచ్చిపోయారు. ఓపెనర్ పథుమ్ నిశాంక(187) విధ్వంసక సెంచరీతో జట్టును పటిష్ట స్థితిలో నిలిపాడు. తొలి సెషన్‌లోనే తైజుల్ ఇస్లాం బౌలింగ్‌లో లహిరు ఉదారా(29) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగినా.. తన మార్క్ షాట్లతో అలరించాడీ ఓపెనర్. 23 ఫోర్లు, ఒక సిక్సర్‌తో చెలరేగిన నిశాంక.. దినేశ్ చండీమాల్‌తో కలిసి రెండో వికెట్‌కు రెండొందలకు పైగా భాగస్వామ్యం నెలకొల్పాడు. ప్రమాదకరంగా మారిన ఈ జోడీని విడదీసిన నయీం హసన్ బంగ్లాకు బ్రేకిచ్చాడు. కెరియర్లో చివరి టెస్టు మ్యాచ్ ఆడుతున్న ఏంజెలో మాథ్యూస్(39) ఉన్నంత సేపు అలరించాడు.

**స్వల్ప వ్యవధిలో..**

క్రీజులో కుదురుకున్న అతడిని టీ సెషన్ తర్వాత మొమినుల్ ఔట్ చేయడంతో 293 వద్ద లంక మూడో వికెట్ పడింది. కాసేపటికే జట్టు స్కోర్ మూడొందలు దాటించిన నిశాంక కూడా పెవిలియన్ చేరాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన కమిందు మెండిస్(37 నాటౌట్), కెప్టెన్ ధనుంజయ డిసిల్వా(17 నాటౌట్)లు బంగ్లా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ మరో వికెట్ పడనివ్వలేదు. దాంతో, ఆతిథ్య జట్టు మూడో రోజు ఆట ముగిసే సరికి 4 వికెట్లు కోల్పోయి 368 పరుగులు చేయగలిగింది.

## నేటి నుంచి భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు



**లీడ్స్**

భారత క్రికెట్‌లో నవశకానికి నాంది పడింది. పరివర్తనలో భాగంగా దిగ్గజాల వారసత్వానికి కొనసాగింపుగా కెప్టెన్సీ పగ్గాలు అందుకున్న శుభ్‌మన్‌గిల్..టీమ్‌ఇండియాను ముందుకు నడిపించనున్నాడు. 25 ఏండ్ల వయసులో టెస్టు కెప్టెన్సీ అందుకున్న గిల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. చివరిసారి 2007లో ఇంగ్లండ్‌లో టెస్టు సిరీస్ గెలిచిన భారత్ 18 ఏండ్లుగా సిరీస్ విజయం కోసం చకోరా పక్షిలా ఎదురుచూస్తున్నది. తొలిసారి అజిత్ వాడేకర్ సారథ్యంలో 1971లో సిరీస్ గెలిచిన భారత్‌కు 1986లో కపిల్‌దేవ్ రెండోసారి విజయాన్ని అందించాడు. ఆ తర్వాత మిస్టర్ డిపెండబుల్ రాహుల్ ద్రవిడ్ కెప్టెన్‌గా 2007లో ఇంగ్లండ్‌లో ఇండియా టెస్టు సిరీస్ ముద్దాడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇంగ్లండ్‌లో టీమ్‌ఇండియాకు చేదు అనుభవాలే ఎదురయ్యాయి. పచ్చికతో కళకళలాడే ఇంగ్లండ్ పిచ్‌లపై డ్యూక్ బంతి చేసే విన్యాసాలకు మన బ్యాటర్లు తేలిపోవడంతో సిరీస్‌లు చేజారాయి. అయితే గత అనుభవాలను తిరగరాస్తూ గిల్-గంభీర్ కాంబినేషన్‌లో కొత్త చరిత్ర శ్రీకారం చుట్టేందుకు టీమ్‌ఇండియా తహతహలాడుతున్నది. ఓవైపు అనుభవలేమి కనిపిస్తున్నా..మెండైన ఆత్మవిశ్వాసంతో కనిపిస్తున్న యువ క్రికెటర్లు అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. మరోవైపు బజ్‌బాల్‌తో టెస్టు క్రికెట్‌కు కొత్త రూపాన్ని తీసుకొచ్చిన స్టోక్స్-మెక్‌కల్లమ్ జోడీ..భారత్‌ను నిలువరించేందుకు పక్కా వ్యూహంతో బరిలోకి దిగుతున్నది. గత రెండు దశాబ్దాలు ఇంగ్లండ్ పేస్ బౌలింగ్‌ను తమ భుజస్కంధాలపై మోసిన అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్ లేని లోటు స్పష్టంగా కనిపిస్తున్నది. వీరి గైర్హాజరీలో ఇంగ్లండ్ పేస్ దళం అనుభవలేమితో కనిపిస్తున్నది.

# స్పోర్ట్స్

## ఇంగ్లండ్ కంచుకోటలో 23 ఏళ్లుగా ఓటమి.. గిల్ సేన చరిత్ర తిరగరాసేనా..?



సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత జట్టు అసాధారణ పోరాటానికి నిదర్శనాలు చాలానే. గత పదేళ్ల కాలంలో విదేశీ గడ్డపై చరిత్రాత్మక విజయాలు సాధించింది టీమిండియా. ఇప్పుడు మరోసారి సంచలన ప్రదర్శనతో రికార్డులను తిరగరాసే అవకాశం టీమిండియాకు వచ్చింది. ఎందుకంటే.. గత 23 ఏళ్లుగా హెడింగ్లే మైదానంలో భారత్‌కు ఓటమి ఎదురవుతూనే ఉంది. కెప్టెన్లు మారినా సరే అక్కడ గెలుపు సంతకం మాత్రం సాధ్యం కాలేదు. అయితే.. ఈసారి యువరక్తంతో నిండిన శుభ్‌మన్ గిల్ సేన అద్భుతం చేయాలనుకుంటోంది.డబ్ల్యూటీసీ సైకిల్‌లో తొలి సిరీస్, తొలి మ్యాచ్‌ను విజయంతో ఆరంభించి.. ఆతిథ్య ఇంగ్లండ్‌కు కొత్త రికార్డు నెలకొల్పాలనే కసితో ఉన్నారు కుర్రాళ్లు. ఇంగ్లండ్‌కు కంచుకోటగా పేరొందిన లీడ్స్‌లోని హెడింగ్లే మైదానం భారత జట్టుకు ఎన్నో పీడకలల్ని మిగిల్చింది. ఈ గ్రౌండ్‌లో ఆతిథ్య జట్టు ఆధిపత్యానికి టీమిండియా తలొగ్గిన సందర్భాలు చాలానే. అయితే..1979లో తొలిసారి హెడింగ్లేలో టీమిండియా మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. సునీల్ గవాస్కర్ వీరోచిత పోరాటంతో పరువు కాపాడుకున్న భారత్.. 1986లో మాత్రం పంజా విసిరింది.ఇంగ్లండ్‌ను వణికిస్తూ 279 పరుగుల భారీ విజయంతో చరిత్ర సృష్టించింది. ఆ తర్వాత విక్టరీ కోసం దాదాపు రెండు దశాబ్దాలునిరీక్షించింది టీమిండియా. సచిన్ టెండూల్కర్(193), సౌరభ్ గంగూలీ(128), 'వాల్' రాహుల్ ద్రవిడ్ (148) శతకంతో విజృంభించగా 2002లో ఇంగ్లండ్‌పై ఇన్నింగ్స్ 46 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ఆ మ్యాచ్‌లో భారత జట్టు 628-8 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా.. అనిల్ కుంబ్లే, హర్భజన్ సింగ్ తలా మూడేసి వికెట్లు తీయగా ఫాలో ఆన్ ఆడింది ఇంగ్లండ్. రెండో ఇన్నింగ్స్‌లోనూ కుంబ్లే(4-66) తిప్పేయగా గెలుపొందిన భారత్‌కు ఈ మైదానంలో ఇదే ఆఖరి విజయం అయింది.



# నేరుగా ఓటీటీలోకి రాబోతున్న అభిషేక్ బచ్చన్ మూవీ

బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'కాళిధర్ లపతా'. దైవిక్ భగేలా, జీషన్ అయూబ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి మధుమిత దర్శకత్వం వహించగా.. జీ స్టూడియోస్ బ్యానర్‌పై నిర్మించింది. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం థియేటర్‌లలో విడుదల కాకుండా నేరుగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక జీ5లో జూలై 4న స్ట్రీమింగ్ కాబోతుంది. ఈ విషయాన్ని అభిషేక్ బచ్చన్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ చిత్రం ఒక వృద్ధుడి చుట్టూ తిరుగుతుంది. తన కుటుంబం తనను వదిలించుకోవాలని అనకుంటుందని తెలుసుకున్న ఆ వృద్ధుడు ఇంటి నుండి పారిపోవడానికి ప్రయత్నిస్తాడు. ఈ క్రమంలో, అతనికి ఎనిమిదేళ్ల అనాథ అయిన బల్లుతో ఊహించని పరిచయం అవుతుంది. అయితే బల్లు పరిచయం అయ్యాకా అతడి జీవితంలో జరిగిన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా కథ.

# కళ్ళతోనే కవ్విస్తున్న కన్నడ భామ.. రుక్మిణి లేటెస్ట్ పిక్స్ అదుర్స్

కన్నడలో సూపర్ హిట్ అయిన సినిమా సప్త సాగరాలు దాటి సినిమా. ఇందులో రక్షిత్ శెట్టి హీరోగా నటించగా.. కథానాయికగా అందరి దృష్టిని ఆకర్షించింది రుక్మిణి వసంత్. బీర్బల్ సినిమాతో హీరోయిన్ గా తెరంగేట్రం చేసిన ఈ వయ్యారి హిందీలో అప్ స్టైర్స్ అనే సినిమాలో నటించింది. మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకున్న ఈ వయ్యారికి ఇప్పుడు సోషల్ మీడియా భారీ ఫాలోయింగ్ వచ్చేసింది. సప్త సాగరాలు దాటి సినిమాతో సౌత్ ఇండస్ట్రీలో ఒక్కసారిగా ఫేమస్ అయ్యింది ఈ హీరోయిన్. ఈ సినిమా ఆమెకు స్టార్ ఇమేజ్ తెచ్చిపెట్టింది. దీంతో తెలుగుతోపాటు కన్నడలోనూ ఈ బ్యూటీకి వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. కన్నడలో శ్రీమురళీకి జోడిగా భఘీర చిత్రంలో నటించింది. ఈ సినిమా పర్లేదు అనిపించుకుంది.. అలాగే నిఖిల్ సరసన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో చిత్రంలో నటించింది. ప్రస్తుతం కన్నడ, తెలుగులో మరిన్ని ఆఫర్స్ అందుకుంది. ఇటీవలే తమిళంలో విజయ్ సేతుపతి జోడిగా ఏస్ అనే సినిమాలో నటించింది. ఇక ఇప్పుడు ఎన్టీఆర్ నటిస్తున్న డ్రాగన్ సినిమాలోనూ ఛాన్స్ దక్కించుకుందని టాక్. ప్రశాంత్ నీల్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా రుక్మిణి తన ఇన్ స్టాలో షేర్ చేసిన ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. కవ్వించే కళ్లు.. నిషా చూపులతో చంపేస్తోంది ఈ చిన్నది.








# సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీకి ఎప్పుడూ రుణపడి ఉంటాను

బొమ్మరిల్లు, సత్యం, హ్యాపీ, ఢీ, రెడీ, సై చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల మనసులు దోచుకున్న భామ జెనీలియా. తన నటనతో ఎన్నో అవార్డులతో పాటు తెలుగులో స్టార్ హీరోయిన్‌గా పేరు సంపాదించుకుంది. అయితే ఈ భామ బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్‌ని ప్రేమ వివాహం చేసుకున్న అనంతరం చాలారోజులు సినిమాలకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. చాలారోజుల తర్వాత మళ్లీ రీఎంట్రీ ఇస్తుంది. ఆమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం సితారే జమీన్ పర్. ఈ చిత్రంలో జెనీలియా కథానాయకగా నటిస్తుంది. ఈ చిత్రం జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇందులో వరుస ప్రమోషన్స్‌లో పాల్గోంటున్నారు జెనీలియా. ఈ క్రమంలోనే ఒక యాంకర్ జెనీలియాని అడుగుతూ.. మీకు సౌత్ ఇండస్ట్రీలో మంచి సినిమాలు చెప్పుకోదగ్గ పాత్రలు అందలేదు కదా అని అడుగుతాడు. దీనికి జెనీలియా స్పందిస్తూ.. యాంకర్ మాటాలను తప్పుబట్టింది. నాకు ఎప్పుడూ అలా జరుగలేదు. నా సౌత్ సినిమాలు చూసుకుంటే.. నాకు ఎప్పుడూ ఉత్తమ పాత్రలు వచ్చాయి. సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో నేను చేసిన పని నాకు చాలా గుర్తింపును తెచ్చిపెట్టింది. సౌత్ నా కెరీర్ ఎదిగిన స్థలం.. ఇక్కడ నాకు లభించిన పాత్రలను నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను అంటూ జెనీలియా చెప్పుకోచ్చింది.

# 'మర్యాద రామన్న'కు సీక్వెల్ తీసుకువస్తున్న బాలీవుడ్..

**-ఫస్ట్ లుక్ రిలీజ్**

దిగ్గజ దర్శకుడు రాజమౌళి దర్శకత్వంలో సునీల్ హీరోగా వచ్చిన చిత్రం మర్యాద రామన్న ఆర్కా మీడియా బ్యానర్‌పై శోభు యార్లగడ్డా, దేవినేని ప్రసాద్ నిర్మించారు. సలోని కథానాయికగా నటించిది. రాయలసీమ ఫ్యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చిన ఈ చిత్రం 2010లో విడుదలై సూపర్ హిట్ విజయాన్ని నమోదు చేసుకుంది. యితే ఇదే సినిమాను బాలీవుడ్‌లో సన్ అఫ్ సర్దార్ అనే పేరుతో అజయ్ దేవగణ్ రీమేక్ చేసి హిట్టు అందుకోవడమే కాకుండా.. రూ. 100 కోట్ల వసూళ్లను రాబట్టాడు. అయితే ఈ సినిమాకు బాలీవుడ్‌లో తాజాగా సీక్వెల్ తీసుకువస్తున్నారు మేకర్స్. సన్ అఫ్ సర్దార్ 2 అంటూ ఈ సినిమా రాబోతుండగా.. తాజాగా ఈ మూవీ ఫస్ట్ లుక్‌ని చిత్రయూనిట్ విడుదల చేసింది. ఫస్ట్ పార్ట్ లాగే ఈ చిత్రం కూడా కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్నట్లు తెలుస్తుంది. విజయ్ కుమార్ అరోరా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మృణాల్ థాకుర్ కథానాయికగా నటించబోతుంది.

# హిలేరియస్‌గా కీర్తి సురేష్ 'ఉప్పు కప్పురంబు' ట్రైలర్ విడుదల




స్టార్ నటి కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఉప్పు కప్పురంబు'. ఐవీ శశి దర్శకత్వంలో రూపొందిన ఈ సెటైరికల్ కామెడీ డ్రామాను రాధికా ఎల్ నిర్మించారు. యువ నటుడు సుహాస్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియోలో జులై 4 నుంచి తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో నేరుగా స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ చూస్తుంటే.. నాన్న చనిపోవడంతో గ్రామ పెద్దగా అధికారం చేపడుతుంది అమాయకురాలైన కీర్తి సురేష్. ఈ క్రమంలోనే ఆ గ్రామానికి ఒక వింత సంక్షోభం వస్తుంది. ఊరిలో ఉన్న స్మశానంలో జనాలు చనిపోయి హౌజ్‌ఫుల్‌గా మారుతుంది. దీంతో ఇంకా నలుగురు చనిపోయి పూడ్చి పెట్టేంతా స్థలం మాత్రమే మిగిలిఉంటుంది. అయితే ఈ సమస్యను గ్రామస్థులు ఎలా పరిష్కరించుకున్నారు అనేది ఈ సినిమా కథ. వసంత్ మురళీకృష్ణ మళింగంటి ఈ సినిమాకు కథను అందించారు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492